# బలగం TV
BALAGAM

నిజమే మా బలం..ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ మంగళవారం, 28 ఏప్రిల్-2026 | balagamtv100@gmail.com | పేజీలు-8


## పెరిగిన బంగారం ధరలు



**ముంబై,ఏప్రిల్27 :** బంగారం ధరలు మరోమారు పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్ సైట్ ప్రకారం హైదరాబాద్ మార్కె ట్‌లో సోమవారం ఉదయం పది గంటల ప్రాంతంలో బంగారం ధరలు ఇలా ఉన్నాయి. 10 గ్రాముల స్వచ్ఛ మైన 24 క్యారెట్ల బంగారం 1,54,420 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 22 క్యారెట్ల బంగారం 1,41,550 రూపాయల వద్ద ట్రేడ్ అవుతోంది. 10 గ్రాముల 18 క్యారెట్ల బంగారం 1,15,820 వద్ద ట్రేడ్ అవుతోంది.

## రాష్ట్రంలో దైన్యంగా రైతుల పరిస్థితి



- ధాన్యం కోనే దిక్కుల లేకుండా పోయింది
- బిజెపి ఎంపి తేజస్వీ సూర్య వ్యాఖ్యలు దుర్మార్గం
- ఒక్కరు కూడా ఎదిరించి మాట్లాడలేక పోయారు
- బిఆర్ఎస్ ఎంపిలు ఉంటే రణరంగం సృష్టించేవారు
- తెలంగాణ భవన్‌లో బిఆర్ఎస్ అధిరే కెసిఆర్

**హైదరాబాద్,ఏప్రిల్27 :** రాష్ట్రంలో రైతుల పరిస్థితి దిగజారిపోయిందని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అన్నారు. ప్రభుత్వానికి ధాన్యం కొనడం చేత కావట్లేదని విమర్శించారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సోమవారం తెలంగాణ భవన్‌లో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఏం జరుగుతోందో అర్థం కావడం లేదు. తెలంగాణ గురించి ఎంపీ తేజస్వి మిగతా 3లో..

# త్యాగాల పునాదులపై ఏర్పడ్డదే బిఆర్ఎస్



- 14 ఏళ్ల పోరాటంలో తెలంగాను ఐక్యం చేసిన జెండా
- ఆవిర్భావ వేడుకల్లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్,ఏప్రిల్27 :** దశాబ్దాలుగా అన్యాయనికి గుర్రై నెత్తురు మండిన జాతి ఎత్తిన జెండానే గులాబీ జెండా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. త్యాగాల పునాదులపై ఏర్పడిన పార్టీ బీఆర్ఎస్ అన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. జై కేసీఆర్, జైతెలంగాణ అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..స్వీయ రాజకీయ శక్తిగా ఎదిగనప్పుడే సమస్యలకు చరమగీతం పాడవచ్చన్నారు. కేసీఆర్25 ఏండ్ల క్రితం జలదృశ్యంలో గులాబీ జెండా ఎత్తిపట్టారని గుర్తు చేశారు. 14 ఏండ్ల తన పోరాటంతో తెలంగాణ జాతిని ఐక్యం చేసి సబ్బండ వర్ణాలను ఏకతాటిపైకి తెచ్చి తెలంగాణ కలను సాకారం చేశారన్నాను. అడుగడుగునా పోరాటాలు చేస్తూ దిల్లీ మెడలు వంచిన పార్టీ బీఆర్ఎస్ అని కేటీఆర్ అన్నారు. పదేళ్ల పాలనలో మాజీ సీఎం కేసీఆర్.. రాష్ట్రాన్ని అగ్రభాగాన నిలబెట్టారన్నారు. బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తెలంగాణ భవన్‌లో ఆయన పార్టీ జెండా ఎగురవేశారు. కాంగ్రెస్, భాజపా పాలన నుంచి తెలంగాణకు విముక్తి కల్పించి.. మళ్లీ బీఆర్ఎస్‌ను పట్టాలెక్కించేందుకు పోరాటం చేస్తామని వెల్లడించారు. రాష్ట్రాన్ని కాపాడుకునేందుకు పార్టీ పునరంకితం అవుతుందని అన్నారు. సాధించిన తెలంగాణ కోసం అధికారం అప్పగిస్తే పదేండ్ల కాలంలో బాధ్యతగా పని చేసి అన్ని రంగాల్లో ఉన్నతంగా తీర్చిదిద్దారన్నారు. కానీ, రెండున్నర ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ఆరాచక పాలన మొదలైందన్నారు. కాంగ్రెస మిగతా 3లో..

# బిఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్ లేదు

- ఉద్యమంలో ఏది మాట్లాడినా చెల్లింది
- కవిత పార్టీ కుటుంబ గూడుపుఠాణి
- కెసిఆర్ ఆరోగ్యంగా ఉండాలనే కోరుకుంటా
- ఆయన చావాలని తానెప్పుడూ కోరుకోలేదు
- కాళేశ్వరంపై సిబిఐ విచారణ తరవాతే చర్యలు
- చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి




**హైదరాబాద్,ఏప్రిల్27 :** బీఆర్ఎస్ పార్టీకి గతం ఉంది.. భవిష్యత్ లేదని, ఉద్యమ సమయంలో అప్పుడు ఎలా మాట్లాడినా ప్రజలు సహించారని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ప్రాంగణంలో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చిట్‌చాట్‌గా మాట్లాడారు. కవిత కొత్త పార్టీ ఏర్పాటుపైనా ఆయన స్పందించారు. కేసీఆర్ కుటుంబమంతా ఒక్కటే అని విమర్శించారు. వాళ్లు తెచ్చిపెట్టుకున్న నటనను ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ పార్టీకి మనుగడ లేదు. అధికారంలో ఉన్న పదేళ్లు కూడా అలాగే మాట్లాడారు. కేసీఆర్ కుటుంబానికి, బీఆర్ఎస్ పార్టీకి ప్రజలతో సంబంధాలు లేవు. కేసీఆర్ విశ్రాంతిలో ఉన్న ప్రజాప్రతినిధి. ఆయన చావును నేనెందుకు కోరుకుంటానన్నారు. ఆయన ఆరోగ్యంగా ఉంటేనే మాకు మంచిది. ఆయన మరమనిషో కాదో.. కుటుంబ సభ్యులకే తెలుసు. వివక్ష లేని పాలన మాది.. మాకు ప్రతిపక్షమే లేదు అని సీఎం అన్నారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను హైకోర్టు తప్పుపట్టలేదని సీఎం అన్నారు. సాంకేతిక లోపాలున్నాయని మాత్రమే చెప్పిందని.. నివేదిక ఆధారంగా చర్యలు వద్దని కోర్టు చెప్పిందన్నారు. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ తర్వాతే చర్యలు ఉంటాయన్నారు.మాజీ సీఎం కేసీఆర్ ఆరోగ్యంపై తాను ఎప్పుడూ నెగటివ్‌గా ఆలోచించలేదని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్ తనకు రాజకీయ ప్రత్యర్థి మాత్రమేనని, శత్రువు కాదని అన్నారు. కేసీఆర్ ఆరోగ్యంగా ఉండటం తనకే మంచిదని, రాజకీయంగా ఎదుర్కోవడం సులభమవుతుందని వ్యాఖ్యానించారు. విశ్రాంతి తీసుకుంటున్న ప్రజా ప్రతినిధి గురించి చెడు కోరుకోవడం తన స్వభావం కాదని తెలిపారు. కేసీఆర్‌కు గాయమైనప్పుడు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించానని, అసెంబ్లీకి వచ్చినప్పుడు కూడా ఆయన్ను కలిసి యోగక్షేమాలు అడిగానని మిగతా 3లో..

## అలుపెరగని పోరాటంతో లక్ష్యసాధన

- తెలంగాణ కలను సాకారం చేసిన బిఆర్ఎస్
- పార్టీ ఆవిర్భావం సందర్భంగా కెటిఆర్, హరీష్‌ల ట్వీట్లు



**హైదరాబాద్,ఏప్రిల్27 :** తెలంగాణ రాజకీయ యవనికపై అలుపెరుగని పోరాట పటిమతో, స్వరాష్ట్ర స్వప్నాన్ని సాకారం చేసిన భారత రాష్ట్ర సమితి నేటితో 25 వసంతాలను పూర్తి చేసుకుని, 26వ ఏట అడుగుపెట్టింది. ఈ మైలురాయిని పురస్కరించుకుని ఆ పార్టీ అగ్రనేతలు, మాజీ మంత్రులు కెటిఆర్, హరీశ్‌రావు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు కీలక వ్యాఖ్యలు చేశారు. బీఆర్ఎస్ రాజకీయ పార్టీ కాదని.. ఓ విప్లవమని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేటీఆర్ తన సందేశంలో బీఆర్ఎస్ ప్రస్థానాన్ని ఒక మహోజ్వల విప్లవంగా అభివర్ణించారు. నెత్తురు మండి ఒక జాతి ఎత్తిన జెండాగా, స్వీయ రాజకీయ అస్తిత్వ పతాకం నేటికి 25 వసంతాల మైలురాయిని మిగతా 3లో..

## బ్రేక్ అప్ తరవాత అత్యాచార కేసులు కుదరవు



### తేల్చి చెప్పిన సుప్రీం ధర్మాసనం

**న్యూఢిల్లీ,ఏప్రిల్27 :** సహజీవనం తర్వాత అత్యాచారం కేసులు పెట్టడం సరికాదని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. బ్రేక్-అప్ తర్వాత లైంగిక దాడి ఆరోపణలు వర్తించవని పేర్కొంది. పరస్పర అంగీకారంతో కూడిన సంబంధం నేరం కిందకు రాదని న్యాయస్థానం తేల్చిచెప్పింది. పెళ్లి చేసుకోలేదని కక్షపూరితంగా కేసులు పెట్టడం సరి కాదని ధర్మాసనం సూచించింది. తప్పుడు వాగ్దానం, విఫలమైన వాగ్దానాల మధ్య తేడాను గుర్తించాలని కేసు విచారణ సందర్భంగా పిటిషనర్‌కు తెలిపింది. ఈ మేరకు మహారాష్ట్ర న్యాయవాదిపై నమోదైన అత్యాచారం కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇద్దరి వ్యక్తుల బంధంలో ప్రారంభం నుంచీ మోసపూరిత ఉద్దేశం ఉంటేనే నేరం కిందకు వస్తుందని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది.

# రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన

- తీవ్ర సంక్షోభంలో రాష్ట్ర వ్యవసాయ రంగం
- రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు అధ్వాన్నం
- పంట కొనుగోళ్ల కోసం ప్రభుత్వంపై ఒత్తిడి
- ప్రజా సమస్యలపై ఇక నుంచి ఉధృతంగా పోరాటం
- సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



**హైదరాబాద్,ఏప్రిల్27 :** రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన కొనసాగిస్తుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. వీటిపై రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో చర్చించామని తెలిపారు. ప్రతి ప్రజా సమస్యను ఐడెంటిపై చేస్తామని పేర్కొన్నారు. త్వరలోనే కేసీఆర్ అధ్యక్షతన మరో సమావేశం ఉంటుందని వెల్లడించారు. ప్రజా సమస్యలపై ఇక నుంచి ఉధృతంగా పోరాడాలని నిర్ణయించుకున్నామని చెప్పారు.కేసీఆర్ అధ్యక్షతన తెలంగాణ భవన్‌లో జరిగిన రాష్ట్ర కార్యకవర్గ సమావేశంలో కీలక తీర్మానాలు మిగతా 3లో..

## ఎమ్మెల్సీలుగా కోదండరామ్, అజారుద్దీన్ ప్రమాణం





మిగతా 2లో..

## కోర్టుపై తనకు నమ్మకం పోయింది

- ఎందుకు మీరు ఉన్నంత వరకు హాజరు కాను
- ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తిపై కేజ్రీవాల్ వ్యాఖ్యలు
- ఈ మేరకు లేఖ విడుదలచేసిన కేజ్రీవాల్



**న్యూఢిల్లీ, ఏప్రిల్27 :** ఢిల్లీ మద్యం విధానం కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ అనూహ్య నిర్ణయం తీసుకున్నారు. ఈ కేసును విచారిస్తున్న మిగతా 3లో..

## బెంగాల్ ప్రచారం ముగించిన ప్రధాని

- 29న రెండో విడత ఎన్నికలు
- బిజెపి అధికారంలోకి వస్తున్న మోడీ
- మళ్లీ సిఎం ప్రమాణానానికి వస్తానంటూ వెల్లడి



**కోల్‌కతా,ఏప్రిల్27 :** బెంగాల్‌లో ఎన్నికల ప్రచారం ముగిసింది. 29న రెండోవిడత ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో 27న సాయంత్రం ప్రచారం ముగిసింది. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి. ఈ క్రమంలో ప్రధాని మోడీ ప్రచారం ముగిసంది. భాజపా అధికారంలోకి వస్తుందని ప్రధాని మోదీ విశ్వాసం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రచారంలో నేడు చివరి ర్యాలీలో పాల్గొన్నానని.. మళ్లీ బెంగాల్‌లో భాజపా ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి రాష్ట్రానికి తిరిగి వస్తానని ఆశిస్తున్నట్లు తెలిపారు. మే 4న ఎన్నికల ఫలితాలు వెలువడ్డాక రాష్ట్రమంతా మిఠాయిలు పంచుతామన్నారు. అదే ఉత్సాహంతో నేడు తాను వెళున్నట్లు పేర్కొన్నారు. తాను హెలిప్యాడ్ దిగి వస్తుంటే దాదాపు 2 కిలోమీటర్ల దూరం వరకు ఇరువైపులా ప్రజలు ఎదురుచూస్తూ ఉన్నారని అన్నారు. తనను ఆశీర్వదించడానికి వేలాదిమంది ప్రజలు వస్తారని మిగతా 3లో..

## బిఆర్ఎస్ అన్ని కమిటీలు రద్దు



- కొత్త కమిటీలు నియమించాలని కెసిఆర్ ఆదేశం మిగతా 2లో..

## ఏడుగురు ఆప్ ఎంపీల విలీనానికి రాజముద్ర

- వీరంతా బిజెపిలో చేరినట్లుగా గుర్తించిన ఛైర్మన్
- రాజ్యసభలో 113 కు చేరిన బిజెపి సంఖ్యాబలం



**న్యూఢిల్లీ,ఏప్రిల్27 :** ఆమ్ ఆద్మీ పార్టీకి చెందిన ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలో విలీనమవ్వడానికి రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఆమోదం తెలిపారు. ఈ నిర్ణయంతో రాజ్యసభలో రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. ఈ విలీనంతో బీజేపీ సంఖ్యాబలం 113కి పెరిగింది. ఆప్ సభ్యుల సంఖ్య గణనీయంగా తగ్గింది. ఆప్ నుంచి రాఘవ్ చద్దా, సాందీప్ పాఠక్, అశోక్ మిట్టల్, హర్భజన్ సింగ్, స్వాతీ మాలివాల్ సహా ఏడుగురు రాజ్యసభ సభ్యులు బీజేపీలోకి ఫిరాయించారు. వీరి విలీనానికి రాజ్యసభ ఛైర్మన్ ఆమోదం తెలపడంతో వారంతా బీజేపీ సభ్యులయ్యారు. విలీనం తర్వాత తమను బీజేపీ ఎంపీలుగానే పరిగణించాలని కోరుతూ ఈ ఏడుగురూ రాజ్యసభ ఛైర్మన్‌కు వినతి పత్రం సమర్పించారు. దానికి తాజాగా ఆమోదం లభించింది. కాగా, తమ పార్టీ నుంచి బీజేపీలోకి ఫిరాయించిన ఏడుగురు రాజ్యసభ ఎంపీలను సస్పెండ్ చేయాలని కోరుతూ ఆప్ ఆదివారం రాజ్యసభ ఛైర్మన్‌కు వినతిపత్రం సమర్పించింది. కేంద్ర సంస్థలను ఉపయోగించి తమ నాయకులను ఒత్తిడి చేసి బీజేపీలోకి చేర్చుకున్నారని ఆరోపించింది. ఈ అంశంపై చట్టపరమైన పోరాటం కూడా కొనసాగుతుందని తెలిపింది. ఆ పార్టీకి చెందిన ఏడుగురు ఎంపీలు ఇటీవల బీజేపీలో మిగతా 3లో..

balagamtv100@gmail.com

# ఫోటో జర్నలిస్ట్ రఘురాయ్ మృతికి మోడీ సంతాపం



న్యూఢిల్లీ, ఏప్రిల్2 7 : ప్రముఖ భారతీయ ఫోటో జర్నలిస్ట్ రఘు రాయ్ మృతికి ప్రధాని మోడీ సంతాపం ప్రకటించారు. ఆదివారం ఆయన కన్ను మూసిన సంగతి తెలిసిందే. క్యాన్సర్ మహమ్మారితో పాటు వృద్ధాప్య సంబంధిత సమస్యల కారణంగా 83 ఏళ్ల వయసులో ఆయన ప్రాణాలు కోల్పోయారు. రఘు రాయ్ మరణంపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందించారు. సోమవారం ఎక్స్ వేదికగా ఆయ నకు నివాళులర్పించారు. రఘు రాయ్ భారతదేశ జీవనశైలిని తన కెమెరా ద్వారా అద్భుతంగా బంధి ంచిన క్రియేటివ్ దిగ్గజంగా గుర్తుండిపోతారని ప్రధాని పేర్కొన్నారు. మోదీ తన పోస్టులో.. పేర్కొన్నరు. రఘు రాయ్ ఫోటోగ్రఫీలో అసాధారణమైన సున్ని త త్వం, వైవిధ్యం ఉండేవి. ఆయన ఫోటోగ్రఫీ భారత దేశంలోని వివిధ జీవన పార్శ్వాలను ప్రజలకు చేరువ చేసింది. రఘు రాయ్ మరణం ఫోటోగ్రఫీ, సాంస్కృ తిక ప్రపంచానికి తీరని లోటు. ఈ విషాదకర సమ యంలో నా ఆలోచనలు ఆయన కుటుంబసభ్యులు, అభిమానులు, ఫోటోగ్రఫీ రంగానికి చెందిన వారితో ఉన్నాయి. ఓం శాంతి' అని రాసుకొచ్చారు. రఘు రాయ్ 1942లో పంజాబ్‌లోని ఝంగ్‌లో జన్మిం చారు. సివిల్ ఇంజినీరింగ్ చేసిన ఆయన 23 ఏళ్ల వయసులోనే ఫోటోగ్రఫీ వైపు వచ్చారు. 'ద స్టేట్స్‌మన్' వార్తా పత్రికలో ఫోటోగ్రాఫర్‌గా చేరారు. దాదాపు 60 ఏళ్ల పాటు ఫోటోగ్రాఫర్‌గా కొనసాగారు. ఎన్నో అద్భు తమైన చిత్రాలను ఆయన తీశారు. దేశంలో చోటు చేసుకున్న ఎన్నో ముఖ్య ఘట్టాలను, విషాదాలను తన కెమెరాతో బంధించారు. దలైలామా, మదర్ థెరీసా, సత్యజిత్ రే, హరి ప్రసాద్ చౌరాసియా, బిస్మిల్లా ఖాన్ వంటి ప్రముఖుల జీవితాల్లోని అరుదైన కోణాలను కెమెరాతో స్పృశించారు.

# శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు బాంబు బెదింపు

**రంగంలోకి దిగిన సైబర్ క్రైమ్ పోలీసులు**



హైదరాబాద్,ఏప్రిల్27 : హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం రెండో టెర్మినల్‌కు సోమవారం బాంబు బెదిరింపు వచ్చింది. సమాచారం అందిన వెంటనే భద్రతా సిబ్బంది అప్ర మత్తమయ్యారు. వెంటనే రంగంలోకి దిగిన సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ అధికారులు టెర్మినల్ అంతటా విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సహాయంతో ప్రతి ప్రాం తాన్ని పరిశీలించారు. ఈ తనిఖీల తర్వాత ఎలాంటి పేలుడు పదార్థాలు, అనుమానాస్పద వస్తువులు లభించలేదని అధికారులు స్పష్టం చేశారు. దీంతో ఇది ఫేక్ ఈ -మెయిల్ అని నిర్ధారించారు. బెదిరిం పు మెయిల్ ఎక్కడి నుంచి వచ్చిందనే విషయంపై సైబర్ క్రైమ్ పోలీసులు విచారణ చేపట్టారు. మెయిల్ సోర్స్, ఐపీ అడ్రస్ తదితర వివరాలను ట్రాక్ చేసే పనిలో ఉన్నారు. తనిఖీల సమయంలో కాసేపు విమా నాశ్రయంలో భద్రతా జాగ్రత్తలు చేపట్టినప్పటికీ, సాధారణ విమాన సేవలకు పెద్ద అంతరాయం కలగలేదని అధికారులు తెలిపారు. ఇది ఫేక్ ఈ -మెయిల్ అని తేలడంతో విమానాశ్రయ అధికా రులు ఊపిరి పీల్చుకున్నారు.

# మెదక్ జిల్లాలో ట్రావెల్ బస్సు దగ్గం



ఘటనపై దర్యాప్తు చేస్తున్న పోలీసులు

మెదక్,ఏప్రిల్27 : మెదక్ జిల్లాలోని మాసా యిపేట వద్ద ఎన్‌హెచ్ -44పై ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు దగ్ధమైంది. ఈ బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో ఈ ఘటన జరిగింది. అదృష్టవశాత్తు డ్రైవర్,క్లీనర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రాణ నష్టం తప్పింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమో దు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివ రాల ప్రకారం.. ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులో సాంకే తిక సమస్య తలెత్తడంతో, దానిని రిపేర్ చేయించడం కోసం హైదరాబాద్ నుంచి మెదక్ తీసుకువచ్చారు. రిపేర్ పనులు పూర్తయిన తర్వాత సోమవారం తెల్ల వారుజామున డ్రైవర్, క్లీనర్ బస్సును తీసుకుని తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు. మాసాయిపేట పరిసర ప్రాంతాల్లో ప్రయాణిస్తుండగా, బస్సు ఇం జిన్ భాగం నుంచి ఒక్కసారిగా మంటలు చెలరే గాయి. గమనించిన డ్రైవర్ వెంటనే బస్సును రోడ్డు పక్కన నిలిపివేశారు. మంటలు నిమిషాల వ్యవధిలోనే బస్సు మొత్తానికి వ్యాపించాయి. మంటలు వేగంగా వ్యాపించడంతో డ్రైవర్, క్లీనర్ ఏమాత్రం ఆలస్యం చేయకుండా బస్సులో నుంచి కిందకు దూకేశారు. దీంతో వారు క్షేమంగా బయటపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే అగ్నిమాపక సిబ్బంది ఫైర్ ఇంజిన్‌తో ఘటనా స్థలానికి చేరుకున్నారు. సుమారు గంటసేపు శ్రమించి మంటలను అదుపులోకి తీసు కువచ్చారు. అయితే, అప్పటికే బస్సు పూర్తిగా కాలి పోయింది. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహ దారిపై కొంతసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది. పోలీ సులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయా? లేదా రిపేర్ పనుల్లో ఏవైనా లోపాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారిస్తున్నారు.

# ఊరూరా ఎగిరిన బీఆర్ఎస్ జెండా





హైదరాబాద్,ఏప్రిల్27 : తెలంగాణ వ్యాప్తంగా బీఆర్ఎస్ జెండా పండుగ వాడవాడలా పండుగలా కొనసాగింది. తెలంగాణ రాష్ట్రమే లక్ష్యంగా ఉద్యమ సంస్థగా ఆవిర్భవించిన బీఆర్ఎస్ పార్టీ లక్ష్యాన్ని సాధించి, రాష్ట్రం పురోగతి సాధించిన గులాబీ జెండా 25 వసంతాలు పూర్తిచేసుకుని 26 వసంతంలోకి అడుపెట్టింది. తెలంగాణ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకుంది. భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు రాష్ట్రవ్యాప్తంగా పల్లెలు, పట్నాలు, ఆయా ప్రాంతాల పార్టీల కార్యాలయాల్లో ఘనంగా జరిగాయి. పార్టీ శ్రేణులు గులాబీ జెండాలు ఎగరవేసి పటాకులు కాల్చి, స్వీట్లు పంచి పెట్టి సంబురాలు జరుపుకున్నారు. జైతెలంగాణ, జై కేసీఆర్ నినాదాలతో హోరెత్తించారు.

# ఎన్నికల్లో 'మా-మాటి-మానుష్' దే విజయం

**విభజన శక్తులను తిప్పికొట్టాల్సిన అవసరం ఇదే**

**బెంగాల్ ప్రజలను కోరిన సిఎం మమతా బెనర్జీ**



కోల్‌కతా,ఏప్రిల్27 : పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్ని కల్లో 'మా-మాటి-మానుష్' (తల్లి, నేల, ప్రజలు) విజ యం ఖాయమని ముఖ్యమంత్రి, టీఎంసీ అధినేత్రి మ మతా బెనర్జీ అన్నారు. బెంగాల్ సంస్కృతి, వార సత్వాన్ని రక్షించుకోవాలని, విభజన శక్తులను తిప్పి కొట్టాలని ఓటర్లను కోరారు. 'మా-మాటి-మానుష్ ఇక అంచనాలకు సంబంధించిన విషయం కాదు, కా లమే సమాధానమిస్తుంది' అని అన్నారు. ఆదివారం తాను జరిపిన పాదయాత్రకు విశేషంగా స్పందించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. రెండో విడత ఎన్నికల ప్రచారానికి సోమవారం సాయంత్రం 6 గంటలకు తెరపడనుండటంతో సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ప్రజలను ఉద్దేశించి మమతాబెనర్జీ సుదీర్ఘ పోస్ట్ పెట్టా రు. ఐకమత్యం, సంస్కృతి, నాగరికత బెంగాల్‌కు గర్వ కారణమని, బెంగాల్ వారసత్వాన్ని దిగజార్చాలనుకునే విభజన, విధ్వంసకర శక్తులకు రాష్ట్రంలో చోటులేదని పరోక్షంగా బీజేపీని ప్రస్తావిస్తూ మమతా బెనర్జీ ఘాటుగా విమర్శించారు. బీజేపీకి ప్రజలే తగిన గుణ పాఠం చెబుతారని అన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి నలు దిశలకు విస్తరిస్తున్న తరుణంలో ఏ దుష్టశక్తి దానిని అడ్డుకోలేదని పేర్కొన్నారు. ప్రజాసంక్షేమమే పరమా వధిగా ప్రభుత్వం తీసుకుంటున్న సంక్షేమ చర్యలు బెం గాల్ ప్రజలకు రక్షణకవచమని, వీటిని అడ్డుకోవడం భూప్రపంచంలో ఎవరికీ సాధ్యం కాదని అన్నారు. అభివృద్ధి, శాంతి, ప్రగతికి అండగా ప్రజలు నిలబడతా రనే నమ్మకం తనకు ఉందని మమతా బెనర్జీ ధీమా వ్యక్తం చేశారు. 'మన భాష, మన సంస్కృతి, గర్వించ దగిన ఈ నేల వారసత్వాన్ని మనం పరిరక్షిం చుకోవా లి. కులం, మతం, భాష, నేపథ్యంతో సం బంధం లేకుండా ఈనెల 29న ప్రజలంతా జోరపూల్ గుర్తుకు ఓటు వేసి మా-మాటి-మనుష్ అభ్యర్థులకు అఖండ విజయం చేకూర్చాలి' అని మమతా బెనర్జీ కోరారు.



# ఎమ్మెల్సీలుగా కోదండరామ్,అజారుద్దీన్ ప్రమాణం

**ప్రమాణం చేయించిన మండలి చైర్మన్ గుత్తా**

**హాజరైన సిఎం రేవంత్ తదిరులు**



హైదరాబాద్,ఏప్రిల్27 : ఎమ్మెల్సీలుగా ప్రొఫెసర్ కోద ండరాం, అజారుద్దీన్ ప్రమాణస్వీకారం చేశారు. మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణం చేయిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో పా టు పలువురు మంత్రులు హాజరయ్యారు. గవర్నర్ కోటాలో కోదండరాం, మహమ్మద్ అజారుద్దీన్‌లను ఎమ్మెల్సీలుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలి సిందే. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా ఆదేశాల మేరకు సాధా రణ పరిపాలన శాఖ ఈ మేరకు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.ప్రమాణస్వీకారం అనంతరం ఎమ్మెల్సీ కోదండరాం మాట్లాడుతూ.. తనకు మంత్రి పదవిపై ఆశ లేదని వ్యాఖ్యా నించారు. పదవులు అనేవి శాశ్వతం కాదని స్పష్టం చేశారు. ఒకాయన తాను పోరాడాతానా లేదా అని అన్నారని.. తాను పోరాడి చూపిస్తానని చెప్పుకొచ్చారు. గతంలో తనపై అనేక కేసులు పెట్టి ఇబ్బందులకు గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అయిన తన పని ఆగలేదని.. కొనసాగుతోందని స్పష్టంచేశారు. వివాదాస్పద సమస్యకు పరిష్కారం లభిం చిందనిఅన్నారు. లక్ష్యాలను ఎంచుకొని పనిచేస్తానని స్పష్టం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉద్యమకారుల సమస్య లు, ఆదివాసుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానని అన్నారు. ఇప్పటివరకు చేస్తున్న పనిని సమర్థవంతంగా పూర్తి చేయడానికి తనకు ఎమ్మెల్సీ ఉపయోగపడుతుందని వెల్లడించారు. జయశంకర్‌కు ఇచ్చిన మాట ప్రకారం ముం దుకు పోతానని తెలిపారు. గతంలో ఏ రకంగా తన జీవన శైలి ఉందో.. భవిష్యత్తులో కూడా అదేవిధంగా ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం తాను నిలబడతానని.. వారికి ఎప్పుడు అందుబాటులో ఉంటానని కోదండరాం పేర్కొన్నారు మంత్రి అజారుద్దీన్ మీడియాతో మాట్లాడుతూ.. ఎమ్మెల్సీగా తనను ప్రతిపాదించిన కాంగ్రెస్ అధిష్ఠానానికి, మంత్రి మండలికి, పీసీసీకి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. మైనార్టీల సంక్షేమం కోసం మరింత కృషి చేస్తానన్నారు. రాజకీయాల్లో, జీవితంలో ఎత్తు పల్లాలు వస్తుంటాయి. అన్నింటినీ అధిగమిస్తూ ముం దుకు సాగాలి. జూబ్లీహిల్స్‌లో ముస్లింల ఓట్ల కోసమే మం త్రి పదవి ఇచ్చారనేది వాస్తవం కాదు. సీఎం రేవంత్‌రెడ్డి మొదట్నుంచీ మైనార్టీలకు పెద్దపీట వేస్తున్నారని అన్నారు.

# మహిళా న్యాయవాదిపై భర్త కత్తితో దాడి

**సుమోటోగా విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు**

**సమగ్ర దర్యాప్తునకు ఢిల్లీ పోలీసులకు ఆదేశం**



న్యూఢిల్లీ,ఏప్రిల్27 : మహిళా న్యాయవాదిపై భర్త కత్తితో దాడి చేసిన ఘటనపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను సుమోటోగా విచారణకు స్వీకరించింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం సోమవారం ఈ ఘటనపై సంక్షిప్త విచారణ చేపట్టింది. కేసు రిజిస్టర్ చేసి సీనియర్ అధికారిణులతో దర్యాప్తు చేయించాలని ఢిల్లీ పోలీస్ కమిషనర్‌ను ధర్మాసనం ఆదేశించింది. ఎస్పీ లేదా డీఎస్పీ ర్యాంకు అధికారిణులతో మాత్రమే దర్యాప్తు చేయించాలని స్పష్టం చేసింది. బాధితురాలి తరఫున అడ్వకేట్ స్నేహ కలిత బెంచ్ ముందు మాట్లాడుతూ.. 'ఓ మహిళా న్యాయవాది అతి దారుణంగా కత్తి దాడికి గురయ్యారు. అది కూడా భర్త ఆఫీస్‌లో ఆమె కత్తి దాడికి గురయ్యారు. ఆమె చికిత్స కోసం మూడు ఆస్పత్రుల దగ్గరకు వెళితే.. చికిత్స చేయడానికి ఆస్పత్రులు ఒప్పుకో లేదు' అని అన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ.. గాయపడిన బాధితురాలిని చేర్చుకునేందుకు నిరాకరించిన మూడు ఆస్పత్రుల విషయంపై కూడా దర్యాప్తునకు ఆదేశించింది. గాయపడ్డ లాయర్‌కు ఆర్థిక సాయం అందేలా చూడాలని అధికారులకు సూచించింది. తదుపరి విచారణ సమయంలో కేసు దర్యాప్తునకు సంబంధించిన వివరాలను వెల్లడిం చాలని తెలిపింది. కాగా, ఢిల్లీ కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్న అడ్వకేట్ మధు రాజ్‌పుత్ ఆదివారం భర్త చేతిలో కత్తి దాడికి గురయ్యారు. ఈ విషయంపై నిన్ననే చీఫ్ జస్టిస్ సూర్య కాంత్‌కు ఓ లేఖ అం దింది. ఆ లేఖ అందిన వెంటనే ఆయన సుమోటో కేసు రిజిస్ట్రర్ చేయాలని ఆదేశించారు.

# వేగవంతంగా ధాన్యం కొనుగోలు పక్రియ

**అధికారులను ఆదేశించిన**

**కలెక్టర్ ప్రతిమా సింగ్**

**హవేలీ ఘన్‌పూర్ మండల**

**కేంద్రం ఆకస్మిక తనిఖీ**

మెదక్,ఏప్రిల్27 : మెదక్ జిల్లాలో ధాన్యం కొను గోలు పక్రియ వేగవంతంగా జరగాలని.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని కేంద్ర నిర్వాహకులను, వ్యవసాయ, సివిల్ సప్లై అధికారులను జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఆదేశిం చారు. మెదక్ జిల్లా హవేలీ ఘన్పూర్ మండల కేంద్రంలోని ఫ్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా కల ెక్టర్ ధాన్యం కొనుగోలు వివరాలు, అందు బాటులో ఉన్న టార్పాలిన్ కవర్లు, గన్ని బ్యాగులు, కొనుగోలు చేసిన ధాన్యం మిల్లులకు తరలింపు తదితర వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకు న్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం కొనుగోలు వేగంగా జరగాలని ఇప్పటి వరకు 880. మంది రైతుల నుండి 4270. 040 మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయడం జరిగిందని 38 మంది రైతులకు -42 లక్షల రూపాయలు ఖాతాలో జమ చేశామన్నారు. ధాన్యం కొనుగోలు పక్రియ సాఫీగా సాగేందుకు?మూడు దశల్లో టోకెన్ పద్ధతి ని పెట్టడం జరిగిందని.. దీనిని ఆయా శాఖల అధి కారులు తూ. చ తప్పకుండ పాటించాలని తద్వారా రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా?తేమ శాతం వచ్చిన ధాన్యం వేగం గా కొనుగోలు అవ్వ డం జరుగుతుందన్నారు. కొనుగోలు పక్రియ పూర్తి కాగానే వెంటనే ట్యాగ్ చేసిన మిల్లులకు ధాన్యం బస్తాలను తరలించాలన్నారు. రవాణా పరంగా కూడా ఎలాంటి ఆలస్యం లేకుండా తగు లారీలను నిర్వాహకులు కేంద్రాలకు సరైన సమయం లో వచ్చేలా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ సూచిం చారు. వేసవి ఎండల నేపథ్యంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఇచ్చిన టోకెన్ల ఆధారంగా కేంద్రా లకు రావాలన్నారు. అలాగే కేంద్రాలలో తాగు నీరు, నీడ తదితర మౌలిక వసతులు ఉండేలా చూసుకో వాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి నిత్యానంద్, సివిల్ సప్లై మేనేజర్ జగదీష్, తహసీల్దార్ సింధు రేణుక ఫ్యాక్స్ కొనుగోలు కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పార్లమెంట్ తరహాలో అసెంబ్లీ ప్రాంగణం

**సెంట్లర్ హాలును త్వరగా పూర్తి చేయాలి**

**పబ్లిక్ గార్డెన్‌లో సభ్యులకు క్లబ్ ఏర్పాటు**

**స్పీకర్, మండలి చర్మన్‌తో సిఎం రేవంత్ సమీక్ష**



హైదరాబాద్,ఏప్రిల్27: అసెంబ్లీ ప్రాంగణం పార్లమె ంట్ తరహాలో పనితీరు ఉండేలా అవసరమైన మార్పులు చేపట్టాల్సి ఉందని సిఎం రేవంత్ రెడ్డి అభి ప్రాయపడ్డారు. అసెంబ్లీలో చేపట్టాల్సిన పనులపైన శాసనమండలి కాన్ఫరెన్స్ హాల్ లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్ కుమార్‌లతో సమీక్షా సమా వేశం నిర్వహించారు. అధికారులకు పలు సూ చన లు చేసారు. ఈసందర్భంగా పార్లమెంట్ తరహా లో అసెంబ్లీ ప్రాంగణం ఉండాలని అభిప్రాయ పడ్డా రు. సభ గౌరవం పెరిగేలా చర్యలు తీసుకోవాల న్నారు. మెంబర్స్‌కి మరింత ప్రైవసీ ఉండాలన్నారు. పబ్లిక్ గార్డె లో మెంబర్స్ కోసం క్లబ్ ఏర్పాటు చేయాల న్నా రు.మెంబర్స్ కోసంవాకింగ్ ట్రాక్,క్రీడల కోసం ఏర్పా ట్లు ఉండాలన్నారు. వచ్చే సెషన్ నాటికి సెం ట్రల్ హాల్ సిద్ధం కావాలని అన్నారు. పార్లమెంట్ సెంట్ర ల్ హాల్ తరహాలో ఉండాలని సిఎం రేవంత్ గతం లోనే సూచనలు చేశారు. హెరిటేజ్ భవనాలకు నష్టం జరగకుండాచర్యలు ఉండాలని కూడా సూచిం చారు. అసెంబ్లీ ప్రాంగణం భద్రతని పటిష్టం చేయాలన్నారు.

# అంబర్‌పేట చౌరస్తాలో భారీ అగ్నిప్రమాదం

**దగ్ధమైన రెండు కారు షోరూమ్‌లు**

హైదరాబాద్,ఏప్రిల్27 : అంబర్‌పేట్ చౌరస్తాలోని రెనో, మహీంద్ర షోరూమ్స్‌లో సోమవారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. మంటలు భారీగా ఎగిసిపడ్డాయి. ప్రమాదాన్ని పసిగట్టిన వెంటనే షోరూమ్ యజమానులు.. అగ్నిమాపక సిబ్బందితోపాటు పోలీసు లకు సమాచారం అందించారు. హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది.. మంటలార్పుతున్నారు. ప్రమాదానికి గురైన షోరూమ్స్ వెనుక వైపు గృహసముదాయాలు ఉన్నాయి. అగ్ని కీలలు ఎగసిపడుతుండటం, ప్రమాద తీవ్రత అధికంగా ఉండటం తో.. షోరూమ్స్‌కి ఆనుకుని ఉన్న ఇళ్లలోని ప్రజలను పోలీసులు ఖాళీ చేయించారు . అగ్ని ప్రమాదం కారణంగా ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్మేసింది. దీంతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఈ అగ్ని ప్రమాదానికి షార్ట్ సర్క్యూట్ కారణమని అధికారులు భావిస్తున్నారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. అగ్నిప్రమాదం కారణంగా.. షోరూమ్‌లోని వాహనాలన్నీ దగ్ధమయ్యాయని.. భారీగా ఆస్తి నష్టం కలిగిందని షోరూమ్ యజమానులు తెలిపారు.

# బిఆర్ఎస్ అన్ని కమిటీలు రద్దు

**కొత్త కమిటీలు నియమించాలని కెసిఆర్ ఆదేశం**



హైదరాబాద్,ఏప్రిల్27 : బీఆర్ఎస్ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పార్టీ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ రాష్ట్ర స్థాయి కమిటీ మినహా అన్ని కమిటీలను రద్దు చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసి డెంట్ కేటీఆర్‌కు కీలక బాధ్యతలు అప్పగించారు. త్వరలోనే అన్ని స్థాయిల కమిటీలను నియమించా లని కేసీఆర్ ఆదేశాలు జారీ చేశా రు. కొత్త కమిటీలకు శిక్షణా తరగ తులను ఏర్పాటు చేయాలని సూచిం చారు. ఈ బాధ్యతలను కేటీఆర్‌కు అప్పగించారు. అలాగే బీఆర్ ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు పక్రియను వెంటనే ప్రారంభించాలని కేసీఆర్ సూచించారు. బుక్ మీదనే కాకుండా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో సభ్యత్వాలు నమోదు చేయాలని ఆదేశించారు.

# లద్దాఖ్‌లో కొత్తగా పదు జిల్లాలు

**కేంద్రప్రభుత్వం నోటిఫికేషన్ జారీ**

**ఎక్స్ వేదికగా వెల్లడించిన లెఫ్టినెంట్ గవర్నర్**

న్యూఢిల్లీ,ఏప్రిల్27 : కేంద్ర పాలిత ప్రాంతమైన లద్దాఖ్ లో ఐదు కొత్త జిల్లాలు ఏర్పాటుకానున్నట్టు లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా సోమవారంనాడు ప్రకటించారు. కొత్త జిల్లాల ఏర్పాటుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్‌కు ఎల్జీ ఆమోదం తెలిపారు. ఈ విషయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఆయన ప్రకటించారు. ఇదొక చరిత్రాత్మకమైన రోజని, ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిందని పేర్కొన్నారు. ప్రస్తుతం లద్దాఖ్‌లో లెహ్, కార్గిల్ జిల్లాలు ఉన్నాయి. కొత్తగా ఆమోదించిన ఐదు జిల్లాలతో వీటి సంఖ్య ఏడుకు చేరుకుంటుందని సక్సేనా తెలిపారు. కొత్తగా ఏర్పడనున్న జిల్లాల పేర్లను నుబ్రా, షామ్, చాంగ్‌థాంగ్, జన్‌స్కర్, ద్రాస్‌గా ఆయన పేర్కొన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుతో పరిపాలనా సౌలభ్యం పెరుగుతుందని, వృద్ధి, ఉపాధికి కొత్త మార్గాలు ఏర్పడతాయని తెలిపారు. పాలనను నేరుగా ప్రజల దగ్గరకు తీసుకు వెళ్లడంతో ఈ ప్రాంతం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఈ పరివర్తనాత్మక నిర్ణయానికి 2024 ఆగస్టులో హోం శాఖ ఆమోదం తెలిపిందని అన్నారు. ఏరియా పరంగా లద్దాఖ్ అతిపెద్ద కేంద్ర పాలిత ప్రాంతం కాగా, జనాభా పరంగా చిన్నది. చైనా, పాకిస్థాన్‌తో 86,904 చదరపు కిలోమీటర్ల సరిహద్దు కలిగి ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఇక్కడ 2.74 లక్షల జనాభా ఉన్నారు. కశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే 370వ అధికరణను రద్దు చేసిన తర్వాత 2019 ఆగస్టు 5న జమ్మూకశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా కేంద్ర ప్రభుత్వం విభజించింది. లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంతం నేరుగా కేంద్ర హోం శాఖ పాలనలో ఉంది.

## రాష్ట్రంలో దైన్యంగా రైతుల పరిస్థితి

సూర్య ఇష్టం వచ్చినట్లు మాట్లాడారు. ఆయన వ్యాఖ్యలపై కాంగ్రెస్, భాజపా ఎంపీలు ఒక్కమాట మాట్లాడలేదు. బీఆర్ఎస్ ఎంపీలు లోక్‌సభలో ఉండి ఉంటే రణరంగం సృష్టించేవాళ్లు. కాళేశ్వరంపై రాజ్యసభలో సీఆర్ పాటిల్ మాట్లాడితే సురేశ్‌రెడ్డి గట్టిగా ఖండించారు. తెలంగాణ గురించి ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే కాంగ్రెస్, భాజపా నేతలు ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర విభజన సమయంలో.. హైదరాబాద్ విషయంలో రాజీ పడాలని సోనియా గాంధీ ఎన్నో సార్లు చెప్పారు. కానీ.. నేను ఎప్పుడూ రాజీ పడలేదు..అది నా చిత్తశుద్ధి అని కేసీఆర్ అన్నారు.బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మండిపడ్డారు. డీలిమిటేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా బ్రిటిషర్లు భారత్, పాకిస్థాన్‌ను వేరుచేసినట్టు అత్యంత చెత్త విధానంతో ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరుచేశారంటూ తేజస్వి చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సభలోనే ఉన్న కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ సహా 16మంది రాష్ట్ర ఎంపీలు ఎవరూ దానిపై కనీసం అభ్యంతరం తెలుపకుండా మౌనంగా ఉన్నారని.. అదే పార్లమెంట్‌లో మన ఎంపీలు ఉండుంటే తేజస్వి సూర్య మాట్లాడిన మాటలకు రణరంగం చేసేవాళ్లు అని పార్టీ అంతర్గత సమావేశంలో అభిప్రాయపడ్డారు.ఈ 16 మంది కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు తెలంగాణలో పుట్టలేదా? వాళ్లకు తెలంగాణ పౌరుషం లేదా? అని ప్రశ్నించారు. ఎంపీ తేజస్వి సూర్య అనే వెధవ మాట్లాడిన మాటలను ఎందుకు ఎండగట్టలేదని నిలదీశారు. అదే ఒక్క బీఆర్ఎస్ ఎంపీ ఉన్నా పార్లమెంట్‌లో క్షమాపణ చెప్పించేటోళ్లమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు మౌనంగా ఉండి పౌరుషంగా లేకుండా వ్యవహరించారని మండిపడ్డారు. ఒకప్పుడు తెలంగాణ రాష్ట్రాన్ని వ్యవసాయ రంగం నుంచి ఇతర అన్ని రంగాల్లో నంబర్‌వన్‌గా నిలబెట్టామని కేసీఆర్ తెలిపారు. కానీ ఈ ప్రభుత్వం భూముల కబ్జాల్లో నంబర్‌వన్, కూలగొట్టడంలో నంబర్‌వన్‌గా నిలబట్టే ప్రయత్నం చేస్తుందని పేర్కొ న్నారు. ఈ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేయలేని స్థితిలో చేతకానితనంతో ఉన్నదని మండిపడ్డారు. ధాన్యం కొనుగోళ్లు లేకపోవడం వల్ల రైతన్నలు పడుతున్న ఇబ్బందులు చూస్తుంటే తీవ్రంగా బాధ అవుతుందని అన్నారు. చిల్లర కూతలు, చిల్లర మాటలు మాట్లాడుతున్న ముఖ్యమంత్రి, మంత్రులను చూస్తే జాలి వేస్తుందని అన్నారు. ఇక ఈ అంతర్గత సమావేశంలోనే జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ కార్య వర్గానికి పరిచయం చేశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డిని పార్టీ జనరల్ సెక్రటరీగా ప్రకటించారు.

## అలుపెరగని పోరాటంతో లక్ష్యసాధన

అధిగమించిందని పేర్కొన్నారు. సిల్వర్ జూబ్లీ ముగింపు వేడుకల సందర్భంగా కార్యకర్తలకు, సోషల్ మీడియా వారియర్లకు, అభిమానులకు శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ ఓ రాజకీయ పార్టీ మాత్రమే కాదని, అది ఒక విప్లవమని, తెలంగాణ అస్తిత్వం కోసం మళ్లీ పునరంకితం కావాల్సిన సమయం వచ్చిందని కేటీఆర్ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనను విమర్శిస్తూ, కేసీఆర్ నాయకత్వ ప్రాముఖ్యాన్ని హరీశ్‌రావు వివరించారు. నాలుగు కోట్ల గొంతులను ఏకం చేసిన ధిక్కార వేదిక బీఆర్ఎస్ అని, ఉద్యమ తెలంగాణను ఉజ్వల తెలంగాణగా తీర్చిదిద్దిందని కొనియాడారు. ప్రస్తుతం రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమం అడుగంటిందని, అరాచకం తాండవిస్తోందని ఆరోపిం చారు. ప్రజల గుండెల్లో ఇప్పుడు 'రేవంత్ పోవాలి.. కేసీఆర్ రావాలి' అనే నినాదం మార్మోగుతోందని తెలిపారు. నిలిచిపోయిన తెలంగాణ ప్రగతి రథం మళ్లీ పరుగులు తీసే రోజు దగ్గరలోనే ఉందని, గులాబీ జెండా సగర్వంగా మళ్లీ ఎగురుతుందని హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు.

## కోర్టుపై తనకు నమ్మకం పోయింది

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ ఎదుట హాజరుకావడానికి ఆయన నిరాకరించారు. ఈ మే రకు ఆయన న్యాయమూర్తికి ఒక లేఖ రాస్తూ, కోర్టుపై తనకు 'నమ్మకం పోయిందని' సంచలన వ్యాఖ్యలు చేశారు. తన అంత రాత్మ ప్రబోధం మేరకు ఈ నిర్ణ యం తీసుకున్నట్లు కేజ్రీవాల్ వెల్ల డించారు. 'న్యాయం జరు గుతుందన్న ఆశలు ఆవిర య్యాయి. అందుకే మహాత్మా గాంధీ చూపిన సత్యాగ్రహ మార్గంలో నడవాలని నిర్ణయించుకు న్నాను. వ్యక్తిగతంగా గానీ, కనీసం నా తరఫు న్యాయవాది ద్వారా గానీ విచారణకు హాజరుకాను' అని ఆయన లేఖలో పేర్కొన్నారు. చట్టపరంగా తనకు ఉన్న హక్కుల ప్రకారం ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే, సోమవారం విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు కావడంతో హైకోర్టు తదుపరి ఎలాంటి చర్యలు తీసుకుంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఒకవైపు బెంగాల్ ఎన్నికల వేడి, మరోవైపు కేజ్రీవాల్ చుట్టూ తిరుగుతున్న ఈ న్యాయ వివాదాలు దేశ రాజకీయాల్లో వేడిని పెంచుతున్నాయి. మద్యం పాలసీ కేసులో కేజ్రీవాల్‌తో పాటు ఇతర నిందితులను ట్రయల్ కోర్టు గతంలో విడుదల చేసింది. దీనిని సవాలు చేస్తూ సీబీఐ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణకాంత శర్మ విచారిస్తున్నారు.ఈమెగతంలో కేజ్రీవాల్ అరెస్ట్‌ను సమర్థిస్తూ తీర్పునిచ్చారని, అలాగే ఆమె కుటుంబ సభ్యులకు ప్రభుత్వంతో సంబంధాలు ఉన్నాయని ఆరోపిస్తూ.. ఈ కేసు నుంచి ఆమె తప్పుకోవాలని కేజ్రీవాల్ పిటిషన్ వేశారు. గత ఏప్రిల్ 20 ఈ పిటిషన్‌ను జస్టిస్ స్వర్ణకాంత శర్మ కొట్టివేశారు. 'న్యాయమూర్తుల నిజాయతీని లిటిగెంట్లు విచారించలేరు. కేవలం ఊహల ఆధారంగా రీక్యూసల్ కోరలేరు' అని ఆమె ఘాటుగా వ్యాఖ్యానించారు. ఎన్నికల సమయంలో ఒక మాజీ ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి, స్వయంగా న్యాయమూ ర్తికి వ్యతిరేకంగా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. న్యాయవ్యవస్థపై కేజ్రీవాల్‌కు గౌరవం లేదని బీజేపీ విమర్శిస్తుంటే, తమ నాయకుడికి అన్యాయం జరుగుతోందని ఆప్ నేతలు ఆరోపిస్తున్నారు.

## ఏడుగురు ఆప్ ఎంపీల విలీనానికి రాజముద్ర

చేరిన విషయం తెలిసిందే. అయితే ఆ విలీన ప్రక్రియను సోమవారం రాజ్యసభ ఛైర్మన్ సీపీ రాధాకృష్ణన్ ఆమో దించారు. దీంతో రాజ్యసభ వెబ్‌సైట్ ప్రకారం.. ఆమ్ ఆద్మీ పార్టీ ఎంపీల సంఖ్య 10 నుంచి మూడుకు పడిపోయింది. ఇక బీజేపీ సంఖ్య 106 నుంచి 113కు చేరింది. ఇక రాజ్యసభలో ఎన్డీఏ బలం ఇప్పుడు 141 నుంచి 148కి పెరిగింది. దీంతో రాజ్యసభలో మెజారిటీ మార్క్ అయిన 123 సంఖ్యకు బీజేపీ చేరువు అవుతున్నట్లు తెలుస్తోంది. బీజేపీలో చేరినట్లు ఆమ్ ఆద్మీ పార్టీలు సమర్పించిన విలీన లేఖపై రాజ్యసభ ఛైర్మన్ రాధాకృష్ణన్ న్యాయపరమైన అభిప్రాయాన్ని తీసుకున్నట్లు తెలుస్తోంది. ఏడుగురు ఆప్ ఎంపీలు ఆ లేఖపై సంతకం చేశారు. అయితే ఆ పార్టీకి చెందిన రాజ్యసభ ఎంపీల సంఖ్యలో 2/3 మెజారిటీ ఉన్నది. దీంతో ఎంపీల విలీన ప్రక్రియకు దాదాపు క్లియరెన్స్ వచ్చేసింది. రాఘవ్ చద్దా, సందీప్ పాతక్, స్వాతి మాలివాల్, హర్భజన్ సింగ్, విక్రమ్‌జీత్ సాహ్నే, అశోక్ మిట్టల్, రాజేందర్ గుప్తాలు బీజేపీలో చేరారు. ఆప్ ఎంపీలు రాసిన లేఖ రాజ్యాంగంలోని పదవ షెడ్యూల్‌కు తగినట్లు ఉందని రాజ్యసభ్య ఛైర్మెన్ భావిస్తున్నట్లు తెలిసింది. ఆ షెడ్యూల్ ప్రకారం 2/3 మెజారిటీ ఉంటే, విలీనాన్ని ఆమోదించవచ్చు. మరోవైపు ఆ ఏడుగురు ఎంపీలను అనర్హులుగా ప్రకటించాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఛైర్మెన్‌ను కోరిన విషయం తెలిసిందే.

## బెంగాల్ ప్రచారం ముగించిన ప్రధాని

ఊహించలేదని సంతోషం వ్యక్తంచేశారు. బెంగాల్‌లోని బారక్‌పుర్‌లో నిర్వహించిన ప్రచారంలో ఈ వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లోకి ప్రవే శించి.. భాజపాలో చేరిన తర్వాత ఓ కార్యకర్తగా పార్టీ ఏది చేయమన్నా చేశానని ప్రధాని వెల్లడించారు. ఎన్నికల బాధ్యతలు స్వీకరించడం కూడా ఇందులో భాగమేనని అన్నారు. తనకు ప్రత్యేకంగా ఓ కుటుంబం అంటూ ఏదీ లేదని.. దేశ ప్రజలే తన కుటుంబమని పేర్కొన్నారు. గత నాలుగు దశాబ్దాలుగా తాను దేశంలోని ప్రతి ప్రాంతంలో పర్యటిస్తున్నానని..ఈ రోడ్‌షోలే తనకు పుణ్యయాత్రలని వ్యాఖ్యా నించారు. వారు అధికారంలోకి రావడానికి కారణమైన 'మా-మాటి-మనుష్' నినాదాన్నే టీఎంసీ నేతలు విడిచిపెట్టారని ప్రధాని ఆరోపించారు. ఎన్నికల ప్రచార సమయంలో వారు ఒక్కసారి కూడా ఈ నినాదాన్ని ప్రస్తావించకపోవడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఆ పార్టీ నేతలు రాష్ట్ర అభివృద్ధిని పక్కనపెట్టి ధూషణలు, బెదిరింపు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. టీఎంసీ పాలనలో మహిళలపై మునుపెన్నడూ లేని స్థాయిలో దాడులు జరుగుతున్నాయని, నేరస్థులు స్వేచ్ఛగా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే నిందితులను కఠినంగా శిక్షిస్తామన్నారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్ అరాచక పాలన

చేశామని కేటీఆర్ తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అన్నివర్గాలకు ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానం చేశామని పేర్కొన్నారు. అరాచక కాంగ్రెస్ పాలనకు సంబంధించి భేటీలో నిర్ణయాలు తీసుకున్నామని చెప్పారు. తెలంగాణలో సబ్బండ వర్గాలు, సకల జనులకు ధన్యవాదాలు చెబుతూ తీర్మానం చేశామని అన్నారు. సమావేశం సందర్భంగా కీలక విషయాలను చర్చించామని తెలిపారు. కేసీఆర్ పార్టీ ఏర్పాటుకు దారి తీసిన పరిస్థితులు వివరించారని పేర్కొన్నారు. రైతుబంధు తీసుకొచ్చి రైతులను ఆదుకోవడాన్ని ఐరాస ప్రశంసించిందని చెప్పారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందని అన్నారు. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లు సరిగ్గా జరగడం లేదని తెలిపారు. ఏ ఆంక్షలు లేకుండా మక్క, జొన్న పంటలను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. పంట కొనుగోళ్లు సరైన రీతిలో చేపట్టకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. పంట కొనుగోళ్లు త్వరగా చేసేలా ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావడంపై సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును పాకిస్థాన్ విభజనతో పోలుస్తూ పార్లమెంటులో బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించామని కేటీఆర్ తెలిపారు. పార్లమెంటులో బీఆర్ఎస్ లేని లోటు స్పష్టంగా కనిపించిందని అన్నారు. తేజస్వి మాట్లాడిన సమయంలో సభలో ఒక్క బీఆర్ఎస్ ఎంపీ ఉన్నా అతనితో క్షమాపణలు చెప్పించి ఉండేవాళ్లమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీల నిష్క్రియాపరత్వంపై సమావేశంలో నిరసన వ్యక్తమైందని చెప్పారు. బీజేపీ ఉద్దేశపూర్వకంగానే మహిళా బిల్లుకు అడ్డుపుల్ల వేసిందని కేటీఆర్ విమర్శించారు. మహిళా బిల్లుకు మద్దతుగా ఆనాడే బీఆర్ఎస్ తీర్మానాలు చేసి పంపిందని చెప్పారు. మహిళా రిజర్వేషన్లపై కార్యవర్గ సమావేశంలో తీర్మానం చేశామని తెలిపారు. సర్ పై కూడా కూలంకషంగా సమావేశంలో చర్చించామని కేటీఆర్ తెలిపారు. పశ్చిమ బెంగాల్‌లో 95 లక్షలు, బిహార్‌లో 65 లక్షల ఓట్లు తొలగించారని పేర్కొన్నారు. త్వరలోనే తెలంగాణలో కూడా సర్ మొదలు కాబోతుందని వెల్లడించారు. సర్ విషయంలో కార్యకర్తలు జాగ్రత్తగా ఉండాలని కేసీఆర్ దిశానిర్దేశర చేశారని వివరించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో దొంగ ఓట్లు సృష్టించి గెలిచారని తెలిపారు. సర్ విషయంలో పార్టీ శ్రేణులు క్రియాశీలకంగా ఉండాలని కేసీఆర్ సూచించారని చెప్పారు. బూత్ లెవల్ టు స్టేట్ లెవల్ క్రియాశీలకంగా పనిచేయాలని తీర్మానం చేశామని తెలిపారు. పార్టీ సభ్యత్వ నమోదు, పార్టీ కమిటీలపైనా సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర కమిటీ మినహా మిగతా అన్ని కమిటీలను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నారని పేర్కొన్నారు. కొత్త కమిటీలను తొందరలోనే చేస్తామని చెప్పారు. స్టేట్ కమిటీ ఆధ్వర్యంలో మెంబర్‌షిప్ కార్యక్రమం చేపడతామని అన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ రెండు పద్ధతుల్లో సభ్యత్వ నమోదు చేస్తామని చెప్పారు. రాశి కంటే.. వాసి ముఖ్యమని కేటీఆర్ అన్నారు. క్వాలిటేటివ్‌గా మెంబర్‌షిప్ చేయాలని నిర్ణయించుకున్నామని తెలిపారు. బీఆర్ఎస్ నాయకత్వం తెలంగాణకు రక్షణ కవచంలా నిలబడాలని సూచించారు. ప్రతి నియోజకవర్గంలో ముఖ్య కార్యకర్తలకు, నాయకులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని చెప్పారు. దీనికి సంబంధించి త్వరలోనే షెడ్యూల్ వెల్లడిస్తామని అన్నారు.కవిత 'టీఆర్ఎస్' పేరుతో పెట్టిన కొత్త పార్టీపై కేటీఆర్ స్పందించారు. చాలా పార్టీలు వస్తుంటాయి.

# చంద్రబాబు ఆదేశాలతో కదిలిన అధికారులు

**బంకుల్లోకి చేరుతున్న పెట్రో, డీజిల్**

**రవాణా వ్యవస్థకు ఆటంకం రావద్దన్న మంత్రి**



**అమరావతి,ఏప్రిల్27 :** ఇంధన సమస్యపై ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాలతో అధికారులు అప్రమత్తమయ్యారు. గత నాలుగు రోజుల నుంచి నంది గామలో డీజిల్, పెట్రోల్ లేక వాహనదారులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. సీఎం ఆదేశాలతో నందిగామలో పలు బంకులకు పెట్రోల్, డీజిల్ చేరింది. పెట్రోల్ బంకుల వద్ద పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారులు భారీగా క్యూ కట్టారు.సోమవారం సాయంత్రానికి అన్ని బంకులకు పెట్రోల్, డీజిల్ చేరుతుందని అధికారులు స్పష్టం చేశారు. పెట్రోల్ బంక్ నుంచే అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇం ధన సమస్యతో రైతులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. క్యానుల్లో కొట్టాలంటే వీఆర్వో దగ్గర లెటర్ తీసుకోవాలని అధికారులు తెలిపారు. తమను పట్టించుకోవట్లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికిప్పుడు వీఆర్వో లెటర్ కావాలంటే అది తీసుకువచ్చి ఎప్పుడు కొట్టించుకోవాలని రైతన్నలు ప్రశ్నించారు. పెట్రోల్, డీజిల్ సరఫరాలో తాత్కాలిక అంతరాయాలు ఉన్నప్పటికీ రవాణా సేవలు ఆగకూడదని అధికారులను మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆదేశించారు. రవాణా సంస్థలు అప్రమత్తంగా ఉండాలని దిశానిర్దేశర చేశారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. రాష్ట్రంలో ఎక్కడా ప్రయాణికులకు ఇబ్బం దులు కలగకుండా అన్ని రవాణా సంస్థలు తక్షణ చర్యలు చేపట్టాలని అన్నారు. పెట్రోల్, డీజిల్ సరఫరాలో తాత్కాలిక అంతరాయాలు ఉన్నప్పటికీ, ప్రయాణికుల సేవల్లో ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయా లని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని బస్సులు, ఇతర రవాణా సేవలు నిరంతరంగా కొనసాగి ంచాలని వ్యాఖ్యానించారు. రవాణా సంస్థలు, ప్రైవేట్ ఆపరేటర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎక్కడైనా నిర్లక్ష్యం వల్ల ప్రయాణికులకు అసౌకర్యం కలిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు కూడా ఆందోళన చెందకుండా తమకు సహకరించాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కోరారు.

## తాడిపత్రిలో హిజ్రా అనుమానాస్పద మృతి

**ప్రత్యర్థి వర్గం హత్య చేసి ఉంటుందని అనుమానం**

**దర్యాప్తు చేపట్టిన పోలీసులు**



**అనంతపురం,ఏప్రిల్27 :** అనంతపురం జిల్లా తాడిపత్రిలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మల్లిక అనే హిజ్రా రైల్వే గేట్ పట్టాలపై శవమై కనిపించడం స్థానికంగా కలకలం సృష్టించింది. ఇది ముమ్మాటికీ హత్యేనని తోటి హిజ్రాలు ఆరోపిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిపత్రి పట్టణానికి చెందిన మల్లిక అనే హిజ్రా ఆదివారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయింది. ప్రత్యర్థి వర్గానికి చెందిన కొందరు హిజ్రాలు ఆమెను ఆటోలో బలవంతంగా తీసుకువెళ్లినట్లు సమాచారం. మల్లికను ఆటోలో తీసుకువెళ్తున్న దృశ్యాలు స్థానిక సీసీటీవీ కెమెరాల్లో రికార్డయ్యాయి. ఈ వీడియో ఆధారాలు ఇప్పుడు కేసు విచారణలో అత్యంత కీలకంగా మారాయి. ఈ ఫుటేజీ ఆధారంగానే పోలీసులు నిందితులను గుర్తించే పనిలో పడ్డారు. ఆదివారం రాత్రి చల్లవారిపల్లి రైల్వేగేట్ సమీపంలోని పట్టాలపై ఓ మృతదేహం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. అది మల్లిక మృతదేహంగా గుర్తించారు. మల్లిక మరణ వార్త తెలియడంతో తోటి హిజ్రాలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. మల్లికను పక్కా పథకం ప్రకారం కిడ్నాప్ చేసి, ప్రత్యర్థి గ్రూపునకు చెందినవారే దారుణంగా హతమార్చారని వారు ఆరో పిస్తున్నారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన పోలీసులు రంగంలోకి దిగి విచారణ వేగవంతం చేశారు. మల్లిక మృతికి సంబంధించి అనుమానితులుగా భావిస్తున్న శిరీష, సంగీత, రాధ అనే ముగ్గురు హిజ్రాలును అదుపులోకి తీసుకుని, విచారణ చేపట్టారు. హిజ్రా వర్గాల మధ్య ఉన్న గ్రూపు తగాదాలే ఈ హత్యకు దారితీశాయా? లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. తాడిపత్రిలో హిజ్రాల మధ్య తలెత్తిన ఈ ఘర్షణ మరణానికి దారితీయడం చర్చనీయాంశంగా మారింది. మల్లిక మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని ఆమె అనుచరులు డిమాండ్ చేస్తున్నారు.

## స్నేహితుల మధ్య గొడువ..ఒకిరిపై దాడి చేసి హత్య




**అనంతపురం,ఏప్రిల్27 :** అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణంలో ఆదివారం రాత్రి ఒక చిన్న వివాదం పెను విషాదానికి దారితీసింది. కేవలం బైక్ తాళం విషయంలో మొదలైన వాగ్వాదం, ఓ యువకుడి ప్రాణాలను తీసింది. స్నేహితుల మధ్య జరిగిన ఈ ఘర్షణ స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి తాడిపత్రి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తాడిపత్రి పట్టణంలోని బంకమట్టి కాలనీకి చెందిన దూదేకుల అబ్దుల్లా, భాష, గౌస్, కార్తీక్‌లు ప్రాణస్నేహితులు. రోజూ వీరంతా కలిసి సరదాగా గడిపేవారు. ఆదివారం రాత్రి వీరి మధ్య ఓ చిన్న విషయంలో మనస్పర్థలు వచ్చాయి. అబ్దుల్లాకు చెందిన బైక్ తాళంచెవిని అతని స్నేహితులు కింద పడవేశారు. ఈ చిన్న విషయంలో అబ్దుల్లాకు ఆయన స్నేహితులైన కార్తీక్, గౌస్‌ల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం మొదలైంది. ఒకరినొకరు దూషించుకోవడంతో గొడవ ముదిరింది. మాట మాట పెరగడంతో ఆవేశానికి లోనైన గౌస్, కార్తీక్‌లు అబ్దుల్లాపై అమానుషంగా ప్రవర్తించారు. విచక్షణ కోల్పోయి పక్కనే ఉన్న పదునైన నాపరాళ్లను తీసుకుని అబ్దుల్లాపై దాడికి దిగారు. ఈ దాడిలో తల, ఇతర భాగాల్లో బలమైన గాయాలు కావడంతో అబ్దుల్లా తీవ్ర రక్తస్రావానికి గురయ్యాడు. గాయాల తీవ్రత ఎక్కువగా ఉండటంతో అబ్దుల్లా అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న తాడిపత్రి పట్టణ పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. హత్యకు పాల్పడిన గౌస్, కార్తీక్‌లను పోలీసులు వెంటనే అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, హత్యకు గల పూర్తి కారణాలు, ఆ సమయంలో అక్కడ ఉన్న ఇతర వ్యక్తుల పాత్రపై పోలీసులు సమగ్ర విచారణ జరుపుతున్నారు. అబ్దుల్లా మరణంతో బంకమట్టి కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి. బాధిత కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

## విశాఖ అభివృద్ధికి చంద్రబాబు కృషి

**లోకేశ్ చొరవతోనే అనేక పరిశ్రమలు రాక**

**ఉత్తరాంధ్ర అభివృద్ధిని దెబ్బతీసిన జగన్**

**ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ విమర్శలు**



**అమరావతి,ఏప్రిల్27 :** ఉత్తరాంధ్ర అభివృద్ధి, విశాఖ నగర భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ అహర్నిశలు కృషి చేస్తున్నారని టీడీపీ ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ అన్నారు. 2014లోనే విశాఖతో పాటు ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్సీ గుర్తు చేశారు. విశాఖను ఐటీ, ఏఐ గ్లోబల్ హబ్‌గా తీర్చిదిద్దాలని అప్పుడే సంకల్పించారని అనురాధ పేర్కొన్నారు.2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉత్తరాంధ్ర అభివృద్ధిని దెబ్బతీసిందని ఎమ్మెల్సీ అనురాధ ఆరోపించారు. వైసీపీ పాలనలో విశాఖను గంజాయి హబ్‌గా మార్చారని, ఉత్తరాంధ్రలో భూ కబ్జాలు, కిడ్నాప్‌లు, లిక్కర్ మాఫియాలు పెరిగాయని తీవ్ర విమర్శలు గుప్పించారు. అవినీతి వాటాల కోసం వైసీపీ ఎంపీలు తమ కుటుంబసభ్యులనే ఒకరినొకరు కిడ్నాప్‌లు చేసుకున్నారని ఎమ్మెల్సీ ఆరోపించారు. 2024లో మళ్లీ ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్నారని ఆమె ప్రశంసించారు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌గా మార్చి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు, పరిశ్రమలు తీసుకువస్తున్నారని ఎమ్మెల్సీ అనురాధ చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు నాయుడు, ఐటీ మంత్రి నారా లోకేశ్ కఠోర శ్రమ ఫలితంగానే రాష్ట్రానికి గూగుల్ డేటా సెంటర్ వచ్చిందని ఎమ్మెల్సీ పేర్కొన్నారు. విశాఖలో ఈ డేటా సెంటర్ శంకుస్థాపన దేశ చరిత్రలో ఒక కీలక ఘట్టంగా నిలుస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 1.80 లక్షల మం దికిఉద్యోగావకాశాలు లభిస్తాయని ఎమ్మెల్సీ వివరిం చారు. అయితే ఈ ప్రాజెక్టను అడ్డుకోవడానికి వైసీ పీ నేతలు కోర్టులను ఆశ్రయించారని, చనిపోయిన రైతుల పేర్లతో పిటిషన్లు దాఖలు చేశారని ఆగ్రహించారు. కంపెనీలకు రాయితీలు ఇవ్వొద్దని కోర్టుకు వెళ్లడం ద్వారా పెట్టుబడులను అడ్డుకునేం దుకు యత్నించారని ఆరోపించారు. గూగుల్ డేటా సెంటర్‌ను గోడౌన్‌తో పోల్చడం వైసీపీ నాయకుల అజ్ఞానానికి నిదర్శనమని మండిప డ్డారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో విశాఖకు జగన్ రెడ్డి ఒక్క పెద్ద పరిశ్రమ కూడా తీసుకురాలేదని ఎమ్మెల్సీ అనురాధ మండిపడ్డారు. జగన్ తన కోసం విలాసవంతమైన ప్యాలెస్ నిర్మించుకోవడం తప్ప రాష్ట్రాభివృద్ధికి చేసిం దేమీ లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో పరిశ్రమలు తీసుకువచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మంత్రి లోకేశ్ శ్రమిస్తున్నారని ఎమ్మెల్సీ పంచుమర్తి అనురాధ కొనియాడారు.

## శేషాచల కొండల్లో కార్చిచ్చు

**తిరుపతి,ఏప్రిల్27 :** శేషాచల కొండల్లో కార్చిచ్చు రేగింది. తిరుపతి శివారు ప్రాంతమైన జీవకోన పైభాగంలోని అటవీ ప్రాంతంలో ఆదివారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతంలో అనూ హ్యంగా మంటలు చెలరేగాయి.ఆఅగ్నిజ్వాలలు కిలోమీటర్లమేర వ్యాపించడంతో అటవీశాఖ సిబ్బంది అక్కడికి చేరుకుని మంటలను ఆర్పడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు.అయితే రాత్రి 10గంటలకు కూడా మంటలు అదుపులోకి రాలేదు. రాత్రికే మంటలను అదుపు లోకి తీసుకొస్తామని తిరుపతి రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి చెప్పారు. మంటలు ఎలా వ్యాపించాయనేది తెలియాల్సి ఉందన్నారు.

## మొక్కజొన్న రైతులను ఆదుకోండి

**వెంటనే కొనుగోలుకు ఏర్పాటు చేయండి**

**ధర్య వ్యత్యాసం కూడా వారికి చెల్లించాలి**

**కేంద్రమంత్రి చౌహాన్‌కు సిఎం చంద్రబాబు లేఖ**

**అమరావతి,ఏప్రిల్27 :** ఆంధ్రప్రదేశ్‌లో మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. 2025-26 రబీ సీజన్‌కు సంబంధించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. మొక్కజొన్న రైతులకు ధరల వ్యత్యాస చెల్లింపు పథకాన్ని వర్తింప చేయాలని విన్నవించారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ రాశారు. ఆంధ్రప్రదేశ్‌లో మొక్కజొన్న సాగు చేసిన రైతులు ఆందోళనగా ఉన్నారు. మార్కెట్‌లో ఈ పంట ధర రోజురోజుకూ పడిపోతోంది. ప్రస్తుతం మార్కెట్‌లో క్వింటా మొక్కజొన్న ధర రూ.1,600 నుంచి రూ.1,700 మధ్య మాత్రమే ఉంది. కనీస మద్దతు ధర రూ.2,400 కంటే చాలా తక్కువగా ప్రస్తుత మార్కెట్ ధర ఉంది. రాష్ట్రంలో సుమారు 42.06 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న దిగుబడి వచ్చే అవకాశం ఉంది. ఇంకా 14.26 లక్షల మెట్రిక్ టన్నుల పంట కోత దశలో ఉంది.కాలంలో ప్రభుత్వం జోక్యం చేసుకోకపోతే రైతులు నష్టపోతారు. మొక్కజొన్న కొనుగోలుకు కేంద్రం నుంచి మద్దతు లేకపోవడంతో రాష్ట్రంపై ఆర్థిక భారం పడుతుంది. పిఎం-ఆశా కింద ధరల వ్యత్యాసాన్ని నేరుగా రైతులకు చెల్లించాలి. ఆంధ్రప్రదేశ్‌ను ప్రత్యేకంగా పరిగణించి, ధరల వ్యత్యాసంలో 100 శాతం నిధులను కేంద్రమే భరించాలి. ఈ పథకాన్ని జూన్ 2026 వరకూ పొడిగించాలి. నాఫెడ్, ఏపీ మార్క్‌ఫెడ్ సమన్వయంతో ఈ పథకాన్ని అమలు చేసేందుకు తక్షణమే అనుమతులివ్వాలి' అని సీఎం చంద్రబాబు లేఖలో కోరారు.

## విశాఖకు చేరుకున్న లోకేశ్

**ఘనంగా స్వాగతం పలికిన టిడిపి నేతలు**

**విశాఖపట్నం,ఏప్రిల్27 :** విశాఖ విమానాశ్రయానికి చేరుకున్న ఆంధ్రప్రదేశ్ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్‌కు ఘనంగా స్వాగతం లభించింది. నగరానికి విచ్చేసిన మంత్రికి టీడీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున స్వాగతం పలికారు. టీడీపీ నేత చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో 'జాబ్ క్రియేటర్ ఇన్ చీఫ్ (వైజాగ్)' అంటూ ప్లకార్డులు పట్టుకుని ఘనంగా స్వాగతించారు. ఎయిర్‌పోర్టు వద్ద మంత్రి లోకేశ్ ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించారు. ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు, గూగుల్ ప్రతినిధుల తేనీటి విందులో పాల్గొనేందుకు నగరానికి లోకేశ్ వచ్చారు. ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ఈరోజు సాయంత్రం 4 గంటల నుంచి ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరగనున్నాయి. ఈ ఉత్సవాలకు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు నాయుడు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు.

## బిఆర్ఎస్‌కు గతమే.. భవిష్యత్ లేదు

రేవంత్ రెడ్డి తెలిపారు. రాజకీయంగా విభేదాలు ఉన్నప్పటికీ వ్యక్తిగతంగా గౌరవం ఉందని పేర్కొన్నారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. కేసీఆర్ బతికి ఉంటే తమకు అధికారం రాదని ఆయన కుటుంబ సభ్యులే భావిస్తున్నారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడే కేటీఆర్ ముఖ్యమంత్రి కావాలని మంత్రులతో ప్రకటనలు చేయించారని ఆరోపించారు. అధికార పంపకాల విషయంలో తేడాలు రావడంతో కుటుంబంలో విభేదాలు వచ్చాయని అన్నారు. అయితే, వాళ్లంతా ఒక్కటేనని వ్యాఖ్యానించారు. అనుబంధ సంఘాలను ప్రభుత్వంపై రుద్దేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్‌ను ఇప్పటికే రెండుసార్లు ఓడించానని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. కేసీఆర్‌కు ఓటమి కొత్త విషయం కాదని, అలాగే గెలుపు కాంగ్రెస్ పార్టీకి కొత్త కాదని అన్నారు. మహేష్ గౌడ్ వర్సెస్ కేసీఆర్‌గా జరిగిన స్థానిక సంస్థల పోరులో కూడా కేసీఆర్ ఓటమి చవిచూశారని గుర్తు చేశారు. తాము వివక్ష లేకుండా ప్రభుత్వం నడుపుతున్నామని, అన్ని వర్గాల ప్రజలకూ సమన్యాయం చేస్తూ పాలన కొనసాగిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

## త్యాగాల పునాదులపై ఏర్పడ్డదే బిఆర్ఎస్

పాలనకు వ్యతిరేకంగా అణగారిన వర్గాల తరఫున పోరాడుతున్నది బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. ఏ బాధ్యత అప్పగించినా బీఆర్ఎస్ పార్టీ సమర్థవంతంగా నిర్వహిస్తుందన్నారు. తెలంగాణ ప్రజలకు స్వీయ రాజకీయ అస్తిత్వం ఉండాలని ప్రొ.జయశంకర్ అనేవారు. తెలంగాణ ప్రజలను కాంగ్రెస్, బీజేపీ నుంచి రక్షించుకునేందుకు ఐక్యంగా పోరాడుదామన్నారు. 2028లో మళ్లీ కేసీఆర్‌ను సీఎంగా చేసేదాకా దండుగా కదం తొక్కుదామని పిలుపునిచ్చారు. కేసీఆర్ దిశానిర్దేశర కోసం గులాబీ దండు ఎదురుచూస్తోందన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వారియర్స్, పార్టీ కార్యకర్తలకు, జర్నలిస్టులకు,కవులు, కళాకారులు, ఉద్యోగులు సమస్త ప్రజానికానికి వినమ్ర ధన్యవాదాలు తెలిపారు.

# ముంబైలో విషాద ఘటన

**ఫుడ్ పాయిజనింగ్‌తో కుటుంబలో నలుగురు మృత్యువాత**

**బలగం టీవి, ముంబై**

మహారాష్ట్రలోని ఓ కుటుంబంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. బంధువులతో కలిసి బిర్యానీ, పుచ్చకాయ తిని కొన్ని గంటల్లోనే తీవ్ర అస్వస్థతకు గురై.. 12 గంటల్లో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృత్యువాత పడ్డారు. వీరిలో 13 ఏళ్ల బాలిక కూడా ఉంది. ఫుడ్ పాయిజనింగ్ జరగడంతో వీరు మరణించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముంబయి లోని పైధోనీలో అబ్దుల్లా అబ్దుల్ కాదర్ (40) మొబైల్ దుకాణం నిర్వహిస్తున్నారు. అతడి భార్య నస్రీన్ (35). ఈ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. శనివారం రాత్రి బంధువులు నిర్వహించిన విందులో అబ్దుల్లా కుటుంబం పాల్గొంది. అక్కడ బిర్యానీని ఆరగించారు. అనంతరం ఇంటికి చేరుకున్నాక అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో పుచ్చకాయ తిన్నారు. ఆదివారం ఉదయం 5 గంటల సమయంలో ఆ కుటుంబంలోని అందరికీ వాంతులు, విరేచనాలు మొదలయ్యాయి. వెంటనే అబ్దుల్లా స్థానికంగా ఉన్న డాక్టర్‌ని పిలిచారు. కానీ అప్పటికే వారి పరిస్థితి విషమంగా మారింది. దీంతో కుటుంబాన్ని స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అనంతరం చికిత్స పొందుతూ ఉదయం 10 గంటల సమయంలో నలుగురూ మృతిచెందారు. దీంతో ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. సమాచారం అందుకున్న పోలీసులు ఆసుపత్రికి చేరుకున్నారు. ఈ ఘటనపై దర్యాప్తు ప్రారంభించారు. ఫుడ్ పాయిజనింగ్ కారణం అయ్యుండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.

# మరో ఆయిల్ ట్యాంకర్‌పై ఇరాన్ దాడి

**మంత్రి మన్‌దీప్ సింగ్ రణ్‌ధావా వెల్లడి**

**బలగం టీవి, న్యూఢిల్లీ**

ఒమన్ తీరానికి సమీపంలో మరో ఆయిల్ ట్యాంకర్‌ను ఇరాన్ దళాలు టార్గెట్

చేశాయి. ఈ విషయాన్ని కేంద్రం వెల్లడించింది. షినాస్ పోర్టు సరిహద్దుకు సమీపంలో టోగో దేశ జెండా కలిగిన నౌక ఎమ్‌టీ సిరోన్‌పై ఏప్రిల్ 25న ఈ దాడి జరిగిందని తెలిపింది. ఇరాన్ టార్గెట్ చేసిన నౌకలో భారత సిబ్బంది కూడా ఉన్నారని కేంద్ర ఓడరేవులు, నౌకారవాణా, జలమార్గాల శాఖ మంత్రి మన్‌దీప్ సింగ్ రణ్‌ధావా తెలిపారు. ఇతర నౌకలతో పాటూ వెళుతున్న ఎమ్‌టీ సిరోన్ నౌకను ఇరాన్ కోస్ట్ గార్డు దళాలు అడ్డగించి హెచ్చరికగా కాల్పులు జరిపాయని చెప్పారు. అయితే, నౌకలో భారతీయ సిబ్బంది అంతా సేఫ్‌గా ఉన్నారని అన్నారు. విదేశాంగ శాఖతో పాటూ ఇతర వర్గాల సమన్వయంతో అక్కడి పరిస్థితిని ఎప్పటికప్పుడు గమనిస్తున్నామని చెప్పారు. భారత నావికుల భద్రతకు కట్టుబడి ఉన్నామని చెప్పారు.

# అవినీతిలో ఇద్దరూ ఇద్దరే

- **మరోమారు మమత, మోడీలపై రాహుల్ విమర్శలు**

**బలగం టీవి, న్యూఢిల్లీ**

పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతాబెనర్జీపై కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ మరోసారి విమర్శలు గుప్పించారు. బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి అయితేనే ఉద్యోగం వస్తుందని, సామాన్యులకు ఎదురుచూపులే మిగులుతున్నాయని అన్నారు. అవినీతిలో ప్రధానమంత్రి మోదీకి దీదీ ఏమాత్రం తక్కువ కాదని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో రాహుల్ విమర్శించారు. బీజేపీ, టీఎంసీ అవినీతే వల్లే పశ్చిమబెంగాల్ అతలాకుతలమైందని, రాష్ట్ర యువత నిరాశానిస్పృహల్లో ఉన్నారని, మహిళలకు భద్రత లేదని, ఆ కారణంగానే ప్రజలు మార్పును కోరుకుంటున్నారని రాహుల్ చెప్పారు. 'టీఎంసీ అవినీతి గురించి బెంగాల్ ప్రజలందరికీ తెలుసు. ప్రధానమంత్రి మోదీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ ఎప్పుడూ దీదీ జోలికి వెళ్లలేదు. ఎందుకంటే అసలైన పోరాటం టీఎంసీతో కాదనే విషయం వాళ్లకు బాగా తెలుసు. బీజేపీతో పోరాటం చేస్తున్న పార్టీ కాంగ్రెస్ మాత్రమే. బీజేపీ ఓట్ల చోరీ చేస్తుంది. ఓట్ల చోరీతోనే మహారాష్ట్ర, హర్యానాలో వాళ్లు గెలిచారు' అని రాహుల్ ఆరోపించారు. జాతీయ రాజకీయాల్లో కాంగ్రెస్ పాత్ర చాలా కీలకమని, బీజేపీని ఓడించ గలిగే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనని అన్నారు. కాంగ్రెస్ సిద్ధాంతాలకు కట్టుబడే పార్టీ అని, బీజేపీతో ఎట్టిపరిస్థితుల్లోనూ తాము రాజీపడే ప్రసక్తే లేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకూ ప్రజలను ఏకం చేసేందుకు భారత్ జోడో యాత్ర నిర్వహించిందని, ప్రధానమంత్రి మాత్రం దేశాన్ని విడగొట్టేందుకు నిరంతరం యాత్రలు సాగిస్తుంటారని విమర్శించారు. 56 అంగుళాలు ఛాతీ ఉందని చెప్పుకునే ప్రధానమంత్రి అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇతర యూఎస్ నేతల ముందుకు తలవంచుతారని విమర్శించారు. సుభాష్ చంద్రబోస్, మహాత్మాగాంధీ, నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ ఎన్నడూ ఎవరికీ తలవంచలేదని, దేశం కోసం ప్రాణత్యాగాలు చేసి, ఏళ్ల తరబడి జైళ్లలో మగ్గిన ఎందరో నేతలు ఎవరి ముందు తలవంచలేదని, వారే నిజమైన దేశభక్తులని కొనియాడారు.

# బ్రిక్స్ కంపెనీలో కుప్పకూలిన క్రేన్

- **ముగ్గురు కార్మికుల దుర్మరణం**

**బలగం టీవి, హైదరాబాద్**

రంగారెడ్డి జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. శంకర్ పల్లి మండలం మహాలింగాపురం దగ్గర ఉన్న ఏసీసీ సిమెంట్ బ్రిక్స్ కంపెనీలో ప్రమాదవశాత్తూ క్రేన్ కుప్పకూలింది. ఈ ఘటనలో ముగ్గురు కార్మికులు మృతి చెందగా.. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమయంలో మొత్తం 10 మంది కార్మికులు ఉన్నట్లు తెలుస్తోంది. గాయపడ్డ కార్మికులను తోటి సిబ్బంది వెంటనే ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీస్తున్నారు. గాయపడిన వారి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు వెల్లడించారు. ప్రమాద తీవ్రతను భట్టి మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కార్మికులు అందరూ ఇతర రాష్ట్రాలకు చెందిన వారిగా సమాచారం. సోమవారం మధ్యాహ్నం సుమారు రెండున్నర గంటల సమయంలో ఒక్కసారిగా వీసిన తీవ్ర గాలులకు క్రేన్ కూలిపోయిందని కార్మికులు తెలిపారు.

# ఎయూ వర్సిటీ అంటే వందేళ్ల చరిత్ర

- **ఆంధ్రాయూనివర్సిటీ..ఓ ఎమోషన్**
- **దేశంలో టాప్-3 విశ్వవిద్యాలయాల్లో ఒకటి**
- **శతాబ్ది ఉత్సవాలలోఓ మంత్రి లోకేశ్**

**బలగం టీవి, విశాఖపట్నం**



ఆంధ్ర యూనివర్సిటీ అంటే పేరు కాదని వందేళ్ల చరిత్రని ఏపీ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే తెలుగువారు పోరాడి తెచ్చుకున్న విశ్వవిద్యాలయం ఏయూ అని లోకేశ్ పేర్కొన్నారు. ఏయూ అంటే ఒక ఎమోషన్ అని.. తానిక్కడ చదువుకుని ఉంటే బాగుండేదని అనిపిస్తోందన్నారు. విశాఖలో ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో విద్యార్థులను ఉద్దేశించి మంత్రి లోకేశ్ ప్రసంగించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత నవ్యాంధ్ర తొలి కేబినెట్ మీటింగ్ ఏయూలోనే ఏర్పాటు చేసినట్లు మంత్రి లోకేశ్ గుర్తు చేసుకున్నారు. ఏయూ చరిత్ర వెనుక ఎంతో మంది త్యాగం, కష్టం ఉందని అన్నారు. ఈ యూనివర్సిటీలో చిహ్నం నుంచి కోర్సులు వరకు అన్ని ప్రత్యేకమే అని చెప్పుకొచ్చారు. ఏయూ అనేక ర్యాంకులు సాధించి.. దేశంలో టాప్-3 విశ్వవిద్యాలయాల్లో ఒకటిగా ఉందన్నారు. అలాగే ప్రపంచంలో టాప్-100 యూనివర్సిటీల్లో నిలిచిందన్నారు. రాజకీయాల్లోనూ ఏయూ విద్యార్థులు రాణిస్తున్నారని మంత్రి చెప్పుకొచ్చారు. ప్రజలకు సేవ చేయాలని 2013 సంవత్సరంలో తాను ప్రత్యక్ష రాజకీయాల్లోకి వచ్చినట్లు గుర్తు చేసుకున్నారు. రిస్క్ లేనిదే విజయం లేదని.. విజయానికి ఓటమి తొలి మెట్టు అని విద్యార్థులకు మంత్రి లోకేశ్ సూచించారు. కాలం మారుతుందని, సాంకేతికత మారుతుందని కరిక్యులం కూడా మారాలన్నారు. ఈ సందర్భంగా విద్య శాఖలో ఖాళీలను రానున్న ఏడాది కాలంలోనే భర్తీ చేస్తామంటూ మంత్రి లోకేశ్ తీపి కబురు చెప్పారు. మంగళవారం నాడు విశాఖలో గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేసుకుంటున్నామని పేర్కొన్నారు. గూగుల్ రాకతో విశాఖ రూపురేఖలు మారిపోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. మరోవైపు ఏయూ వందేళ్ల వేడుకల సందర్భంగా స్మారక నాణెం, స్టాంప్, కాఫీ టేబుల్ బుక్‌ను ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్, సీఎం చంద్రబాబు, ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్, సచిన్ టెండూల్కర్, కేంద్ర, రాష్ట్ర మంత్రుల చేతుల మీదుగా విడుదల చేశారు.

# కవిత ప్రశ్నలకు సమాధానం చెప్పాలి

- **ఇంట్లో ఫ్రస్టేషన్‌ను బయట చూపిస్తే ఎలా**
- **కేటీఆర్‌పై మండిపడ్డ ఎమ్మెల్యే మందల సామేల్**

**బలగం టీవి, హైదరాబాద్**




మీ సోదరి కవిత ఎందుకు పొలిటికల్ పార్టీ పెట్టారో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామెల్ డిమాండ్ చేశారు. కేటీఆర్‌కు రేగు కంపలాగ కవిత తగిలారని వ్యాఖ్యానించారు. సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఎమ్మెల్యే సామేల్.. సీఎం రేవంత్‌పై కేటీఆర్, కవిత చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇచ్చారు. మీ ఇంట్లో ఫ్రస్టేషన్‌ను బయట ఎందుకు చూపిస్తున్నారంటూ విమర్శలు గుప్పించారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏం చేశారని కవిత అడుగుతున్నారని.. ముందు ఆమెకు సమాధానం చెప్పాలని కేటీఆర్‌కు ఆయన స్పష్టం చేశారు. లిక్కర్ కేసులో తన ప్రమేయం లేదని కవిత అంటున్నారని.. నిజంగానే ప్రమేయం లేకుంటే తీహార్ జైలుకు ఎందుకు వెళ్లారో చెప్పాలని కవితను ప్రశ్నించారు. అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లిని కాదని కవితకు ఎమ్మెల్సీ పదవి ఇచ్చారని గుర్తు చేసిన సామేల్.. దీని వెనక ఉన్న రహస్యమేంటో చెప్పాలని కవితను ప్రశ్నించారు. ఇంటి పోరుతో ఇబ్బంది పడుతున్న మీరు.. మంది జోలికి ఎందుకు పోతు న్నారంటూ సెటైర్లు వేశారు. సీఎం రేవంత్ రెడ్డిని ఎవరూ గుర్తుపట్టట్లేదని కేటీఆర్ అంటున్నారని.. కేటీఆర్‌ను గుర్తుపట్టే స్థలాలు తనకు బాగా తెలుసునని సామేల్ వ్యాఖ్యానించారు. గుంట నక్కలు, తోడేళ్ళు అందరూ మీ వద్దనే ఉన్నారంటూ కేటీఆర్‌పై ఎమ్మెల్యేక్ష్మీర్ అయ్యారు. మరో పదేళ్ల కాంగ్రెస్ పార్టీని కదిలించే దమ్ము ఎవరికి లేదని ఎమ్మెల్యే సామేల్ స్పష్టం చేశారు. ఆర్టీసీని ఆగం చేయాలని చూశారని.. కానీ, వారి కుట్రలు ఫలించలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ప్రస్తుతం ఉన్న సీట్లు కూడా రావని జోస్యం చెప్పారు సామేల్.

# విజయం కన్నా వైఫల్యాలే పాఠాలు నేర్పుతాయి

- **జీవితంలో కృషి, పట్టుదల ఉంటే ఏదయినా సాధించవచ్చు**
- **ఆంధ్రా వర్సిటీ ప్రపంచప్రఖ్యాత వర్సిటీగా ఎదగాలి**
- **శతాబ్ది ఉత్సవాల్లో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్**

**బలగం టీవి, విశాఖపట్నం**




కృషి, పట్టుదల ఉంటే ప్రతిదీ సాధ్యమేనని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. మనసు ఉంటే మార్గం ఉంటుందని.. విజయాల కంటే వైఫల్యాలే ఎక్కువ నేర్పుతాయని అభిప్రాయపడ్డారు. విశాఖలోని ఆంధ్ర యూనివర్సిటీ శతాబ్ది ఉత్సవాల్లో ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయూ ఇంజనీరింగ్ కళాశాల గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. విద్యారంగంలో ఏయూ ముందుందని రాధాకృష్ణన్ తెలిపారు. దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే ప్రముఖ విద్య సంస్థగా ఏయూ ఎదగాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. జీవితంలో కృషి, పట్టుదలతో అన్నీ సాధించవచ్చని ఈ సందర్భంగా విద్యార్థులకు ఉప రాష్ట్రపతి సూచించారు. విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులను ప్రశంసించారు. మరోవైపు ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వంపైనా ప్రశంసలు కురిపించారు రాధాకృష్ణన్. గూగుల్‌ను విశాఖకు తీసుకురావడంపై హర్షం వ్యక్తం చేశారు. దీనికి కృషి చేసిన ఏపీ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. అమరావతిని శాశ్వత రాజధానిగా ప్రకటించి స్థిరమైన అభివృద్ధికి నాంది పలికారని కొని యాడారు. గడిచిన ఏడాదిలో దేశానికి వచ్చిన పెట్టుబడుల్లో 25 శాతం ఏపీ సాధించిందని రాధా కృష్ణన్ తెలిపారు. ఇది ప్రభుత్వ పారదర్శకత, స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను ప్రతిబింబిస్తుందని అన్నారు. రానున్న రోజుల్లో విశాఖ గ్లోబల్ డెస్టినేషన్‌గా మారుతుందని ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ ఆకాంక్షించారు. ఏయూలో చదువుకుని ఎందరో ఉన్నత స్థానాలకు వెళ్లారని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. ఈ విశ్వ విద్యాలయం మరిన్ని మైలురాళ్లు సాధించాలని ఆకాంక్షించారు. వందేళ్ల ప్రయాణంలో ఏయూ సమాజానికి ఎంతో సేవ చేసింది. అనేక మంది ఏయూ విద్యార్థులు దేశ రాజకీయాల్లో రాణించారు. నాణ్యమైన విద్య అందించడంలో ఈ విశ్వవిద్యా లయానికి మంచి పేరు ఉందని ఉపరాష్ట్రపతి కొనియాడారు. అంతకుముందు విశాఖ చేరుకున్న ఉపరాష్ట్రపతికి మంత్రి లోకేశ్ తదితరులు ఘనంగా స్వాగతం పలికారు.

# తెలంగాణలో ఇంధన కొరత లేదు

- **కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవు**
- **పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర**

**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణలో ఇంధన కొరత లేదని పౌరసరఫరాల శాఖ స్పష్టం చేసింది. రాష్ట్రంలో తగినన్ని ఇంధన నిల్వలున్నాయని వెల్లడించింది. వదంతులను పట్టించుకోవద్దని పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర విజ్ఞప్తి చేశారు. అన్ని జిల్లాల్లో క్షేత్రస్థాయి పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. కృత్రిమ కొరత సృష్టి.. ఇంధనం నిల్వ చేయడం నేరమని హెచ్చరించారు. మిడిల్ ఈస్ట్ లో టెన్షన్స్ కారణంగా క్రూడ్ ఆయిల్ కొరత కారణంగా దేశ వ్యాప్తంగా ఇంధన సమస్యలు తలెత్తిన విషయం తెలిసిందే. తెలంగాణ రాష్ట్రంలో మరోసారి పెట్రోల్ కొరత భయాలు పెరుగుతున్నాయి. పెట్రోల్ బంకుల్లో డీజిల్ కొరత.. నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు పెట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సివిల్ సప్లై కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర కీలక ప్రకటన చేశారు. తెలంగాణ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో డిమాండ్ కు తగ్గ సప్లై ఉందన్నారు. వాహనదారులు భయాందోళనకు గురి కావొద్దని కోరారు. పలు కారణాలతో కొన్ని పెట్రోల్ బంక్ లు మూసివేసినా? సమస్య పరిష్కారం కాగానే బంక్ లు ఓపెన్ చేస్తారని సివిల్ సప్లై కమిషనర్ తెలిపారు. పక్క రాష్ట్రాల్లో కొరత కారణంగా సమీప జిల్లాల్లోని బంకులకు వాహనదారులు భారీగా క్యూ కడుతున్నారు.

# బెంగాల్ ప్రచారం ఎంతో ఉత్సాహాన్ని ఇచ్చింది

- **బిజెపి ప్రభుత్వ ఏర్పాటుకు ప్రజలంతా కలసి రావాలి**
- **బెంగాల్ ప్రజలకు ప్రధాని మోడీ బహిరంగ లేఖ**

**బలగం టీవి, న్యూఢిల్లీ**



పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల రెండో విడత ప్రచారానికి సోమవారం సాయంత్రం తెరపడటంతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో తాను జరిపిన విస్తృత పర్యటన రాజకీయంగా, ఆధ్యాత్మిక ఎదుగుదల పరంగా తనకెంతో ఉపకరించిందని ఆ లేఖలో పేర్కొన్నారు. బీజేపీ రాష్ట్రాభివృద్ధి రోడ్‌మ్యాప్‌ను రాష్ట్ర ప్రజల ముందు ఉంచానని, అయినప్ప టికీ ఈ లేఖ ద్వారా తన మనోభావాలని రాష్ట్ర ప్రజలందరితోనూ పంచుకోవాలని అనుకుంటున్నానని చెప్పారు. బెంగాల్ సోదర, సోదరీమణుల్లారా అంటూ ప్రధాని తన లేఖను ప్రారంభించారు. ఎన్నికల ప్రచారంలో అసాధారణ శక్తిని తాను అనుభూతి పొందానని, తీవ్రమైన వేడి, వరుస ర్యాలీల్లో పాల్గొన్నప్పటికీ తనకెలాంటి అలసట రాలేదని చెప్పారు. 'ఈ ర్యాలీలు, రోడ్‌షోలు నాకొక యాత్రలాంటి అనుభూతినిచ్చింది. మా కాళి భక్తులతో కలిసి నేను ఎప్పుడు వెళ్లినా ఆ తల్లి నాలో రెట్టించిన శక్తిని నింపుతున్నట్టు అనిపిస్తుంది. 2024 జనవరిలో అయోధ్యలో రామ్‌లల్లా ప్రతిష్ఠాపన జరిగిన 11 రోజులు ఉపవాసం చేశాను. అప్పటిలాగా బెంగాల్ ప్రచారంలో కూడా అలాంటి ఆధ్యాత్మిక అనుభూతే నాకు కలిగింది' అని మోదీ వెల్లడించారు. బెంగాల్‌లో పాల్గొన్న ర్యాలీలు, రోడ్‌షోలలో ప్రజల నుంచి హృదయాన్ని కదలించే ఎన్నో మెసేజ్‌లు, ఫోటోలు తనకు అందాయని, వాటిని ఎప్పటికీ మరచిపోలేనని మోదీ తెలిపారు. ఎంత అర్ధరాత్రయిన వీలు చూసుకుని వాటిని చదవడంతో పాటు స్పందిస్తుంటానని చెప్పారు. యువకులు, మహిళలు, ఆడకూతుళ్లు, పెద్దలు సహా అన్ని వయస్సుల వారు చూపిస్తున్న ఆదరణ మరువలేనని, వారే తనకు అత్యంత విలువైన సంపద అని అభివర్ణించారు. బెంగాల్ సత్వర అభివృద్ధిని ప్రజలు కోరుకుంటున్న విషయం తాను గ్రహించానని, యువత ప్రగతిపథం వైపు దూసుకువెళ్లే అవకాశాల కోసం, ఆడకూతుళ్ల ఆకాశమే హద్దుగా అవకాశాలు అందిపుచ్చుకోవడం, భద్రత కోసం ఎదురుచూస్తున్నారని, రాష్ట్ర ప్రజలంతా మార్పు కావాలనే ఏకైక సంకల్పంతో ఉన్నారని చెప్పారు. ప్రజలు బీజేపీని విశ్వసిస్తున్నారని తెలిపారు. సురక్షిత బెంగాల్‌కు తాను బాధ్యత తీసుకుంటానని, సవాళ్లను అవకాశాలుగా మార్చేం దుకు తాను కృతనిశ్చయంతో ఉన్నానని చెప్పారు. 'రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ ప్రమాణస్వీకారానికి ప్రజలంతా కలిసివస్తారనే నమ్మకం నాకుంది. మనమంతా కలిసి అభివృద్ధి చెందిన బెంగాల్‌ను నిర్మించుకుందాం' అంటూ ప్రధాని ఆ లేఖను ముగించారు.

# రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పాదన పెంచడమే లక్ష్యం

- **విద్యుత్ కొనుగోలు ఛార్జీలు తగ్గించేలా చర్యలు**
- **విద్యుత్ శాఖపై సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు**

**బలగం టీవి, అమరావతి**




విద్యుత్ కొనుగోలు ఛార్జీలు తగ్గించేందుకు ఏపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. యూనిట్ ధరను రూ.4.60కు తగ్గించేలా కసరత్తు చేస్తోంది. సోమవారం నాడు విద్యుత్ శాఖపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో అధికారులకు సీఎం కీలక సూచనలు చేశారు. రాష్ట్రంలో రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పాదన పెంచడమే లక్ష్యంగా చర్యలు చేపట్టాలని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. ఈవీ వాహనాల వినియోగంపై ప్రజల్లో విస్తృత స్థాయి అవగాహన కల్పించాలని సూచించారు. ఇంధన రంగంలో పరిశోధనకు ప్రత్యేక ఎనర్జీ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. పీఎం సూర్య ఘర్, కుసుమ్ పథకాల అమలులో లక్ష్యాలు చేరుకునేలా ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సీఎం చంద్రబాబు సూచించారు. విద్యుత్ వినియోగ దారులకు, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ట్రాన్స్‌మిషన్ నష్టాలను గణనీయంగా తగ్గించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. విద్యుత్ కొనుగోళ్ల భారం తగ్గించుకునేందుకు ఇతర రాష్ట్రాలతో పవర్ స్వాపింగ్ ఎంఓయూలు కుదుర్చుకోవాలని అధికారులకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. పీఎం కుసుమ్ సహా సోలార్ రూఫ్‌టాప్ ప్రాజెక్టులను వేగవంతం చేయాలని అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇప్పటికే కుదుర్చుకున్న ప్రాజెక్టులు 60 రోజుల్లోపు కార్యకలాపాలు ప్రారంభించేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ భవనాలపై సౌర విద్యుత్ ప్రాజెక్టులను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని వారికి ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వ శాఖలతోపాటు ప్రజల్లో విద్యుత్ పొదుపుపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని.. అందుకోసం విద్యుత్ పొదుపు ఉపకరణాల వినియోగాన్ని ప్రోత్సహించేలా కార్యాచరణ రూపొందించాలని విద్యుత్ శాఖ అధికారులకు సీఎం చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. గత ప్రభుత్వ అసమర్థత కారణంగా విద్యుత్ రంగం అస్తవ్యస్తమైందని సీఎం చంద్రబాబు మండిపడ్డారు. ముఖ్యంగా పీపీఏల రద్దు నిర్ణయంతో ప్రజలపై రూ. 9,000 కోట్ల భారం పడిందని విమర్శించారు. విద్యుత్ వినియోగించకుండానే ఆ మొత్తాన్ని కంపెనీలకు చెల్లించడం వైసీపీ ప్రభుత్వం చేసిన గొప్ప తప్పిదమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితిని సరిదిద్దుతూ ఎలాంటి టారిఫ్ పెంపు లేకుండా ప్రజలు ఇబ్బంది పడకుండా సమర్థవంతంగా విద్యుత్ వ్యవస్థను నడిపిస్తున్నామన్నారు. ఈ సమీక్షలో విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్, ట్రాన్స్‌కో, జెన్‌కో ఉన్నతాధికారులు హాజరయ్యారు.



## శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా మ్యాట్ అందజేత..

**బలగం టీవీ, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ శ్రీ వెంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం కళ్యాణం మహోత్సవం పురస్కరించుకొని భక్తుల సౌకర్యార్థం వెంకటేశ్వర స్వాములు, హనుమాన్ స్వాములకు దేవస్థానం వద్ద మ్యాట్ అందజేసిన ముదాం శ్రీనివాస్ కు స్వామివారి కృపా కటాక్షాలు శ్రీనివాసుకు ఎల్లవేళలా ఉండాలని స్వాములు కోరుకున్నారు.

## జనగామలో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..

**బలగం టీవీ, జనగామ:**



బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జనగామ జిల్లా పార్టీ కార్యాలయంలో జెండాను ఆవిష్కరించిన రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ నేటితో 25 సంవత్సరాలు పూర్తి చేసుకుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ అంటే తెలంగాణ బానిస సంకెళ్లను తెంపి మనకు స్వేచ్ఛా స్వాతంత్రాన్ని సాధించిన పార్టీ అని అన్నారు. ఆనాటి సమైక్య పాలకుల అణచివేత నుండి స్వతంత్రం కల్పించిన పార్టీ మన బిఆర్ఎస్. చావు నోట్లో తలపెట్టి కేసీఆర్ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారు. అసాధ్యం అనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాదు తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలను సంరక్షించింది మన బిఆర్ఎస్ పార్టీ. పదేండ్లు తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధిలో నడిపి దేశానికి దిక్సూచిగా నిలిపింది బీఆర్ఎస్ పార్టీ. బీఆర్ఎస్ పార్టీ లేకుండా తెలంగాణను ఊహించలేము. ఈ అభివృద్ధిని ఊహించలేము. బీఆర్ఎస్ అంటే తెలంగాణ ప్రజలకు ఆత్మగౌరవ ప్రతీకన్నారు.తెలంగాణ ఆత్మగౌరవాన్ని ప్రపంచం మొత్తానికి చాటి చెప్పింది గులాబీ జెండా నే. గులాబీ జెండా పుట్టినరోజును రాష్ట్రమంతా ఘనంగా జరుపుకుంటుందన్నారు.

రాష్ట్ర ప్రజలందరికీ, బీఆర్ఎస్ పార్టీ కుటుంబ సభ్యులకు, తెలంగాణ ఉద్యమకారులకు బీఆర్ఎస్ అభిమానులు అందరికీ హృదయపూర్వక బీఆర్ఎస్ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను.అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా మాది ఎప్పుడూ ప్రజల పక్షమే అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు అనేక సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందించాం. 200 రూపాయల పెన్షన్ 2000 చేసింది బీఆర్ఎస్ పార్టీ కాదా. ఆడపిల్లకు కళ్యాణ లక్ష్మి అందించింది బీఆర్ఎస్ పార్టీ.రైతులకు రైతు బీమా, రైతు బంధు వంటి పథకాలను అందించింది బీఆర్ఎస్ పార్టీ.ఇంటింటికి తాగునీరు, వ్యవసాయానికి సాగునీరు అందించింది బీఆర్ఎస్ పార్టీ.కాంగ్రెస్ పార్టీ 420 హామీల అమలు కోసం ప్రశ్నిస్తూనే ఉన్నాం.మహిళలకు 2,500 ఇస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు దాని ఊసే ఎత్తలేదు. 4,000 పెన్షన్ అసలే లేదు. కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసింది. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా ఉన్నాయి. రాష్ట్రంలో అభివృద్ధి కుంటు పడింది. ఆదాయం మందగించింది. ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వంలో ముఖ్యమంత్రి, మంత్రుల మధ్య ఎమ్మెల్యేల మధ్య సఖ్యత లేదు. ఎవరు అవునన్నా కాదన్నా మళ్లీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. మళ్లీ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేది బీఆర్ఎస్ పార్టీ మాత్రమేన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర, జిల్లా, జనగామ, నియోజకవర్గ, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ, పాలకుర్తి నియోజకవర్గాల ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అప్పుల ఒత్తిడితో తంగళ్లపల్లిలో వ్యక్తి ఆత్మహత్య

**బలగం టీవీ, తంగళ్లపల్లి:**



రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లి మండల కేంద్రంలో విషాద ఘటన చోటుచేసుకుంది. తెంబరవేణి శ్యామ్ (55) అనే వ్యక్తి అప్పుల ఒత్తిడిని తట్టుకోలేక ఉరివేసుకుని ఆలిత్మహలిత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆదివారం సాయంత్రం సుమారు నాలుగు గంటల ప్రాంతంలో చోటుచేసుకుంది.

సమాచారం ప్రకారం, శ్యామ్ ఆన్‌లైన్ యాప్‌ల ద్వారా అప్పులు తీసుకున్నాడు. అనంతరం అప్పుల వసూళ్ల పేరుతో కొంతమంది అతనిపై తీవ్ర ఒత్తిడి, వేధింపులకు గురిచేస్తున్నారని తన సూసైడ్ నోట్‌లో పేర్కొన్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగానే ఆయన మనోవేదనకు గురై ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. శ్యామ్ మృతితో తంగళ్ళపల్లిలో విషాద ఛాయలు అలముకున్నాయి. అప్పుల ఊబిలో చిక్కుకొని, యాప్ నిర్వాహకుల వేధింపుల వల్ల ఒక నిండు ప్రాణం బలికావడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించారు.



# హిమాయత్ సాగర్‌లో తీవ్ర విషాదం

**ఈతకు వెళ్లి ఇద్దరు యువకుల మృతి**

**బలగం టీవీ, హైదరాబాద్:**

హైదరాబాద్‌లోని హిమాయత్ సాగర్‌లో తీవ్ర విషాద ఘటన చోటుచేసుకుంది. చేపలు పట్టేందుకు వెళ్లిన ముగ్గురు స్నేహితులు సరదాగా ఈత కొట్టేందుకు నీటిలోకి దిగగా ప్రమాదవశాత్తు మునిగి ఇద్దరు యువకులు మృతి చెందారు. పోలీసుల వివరాల ప్రకారం, టోలీచౌకి ప్రాంతానికి చెందిన షేక్ సల్మాన్ మరియు షాబాజ్ మృతులుగా గుర్తించారు. ఈ ఘటనలో మరో యువకుడు ప్రాణాలతో బయటపడగా, అతడిని వెంటనే సమీప ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు, సహాయక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని శోధన చర్యలు చేపట్టారు.



# వేములవాడ -సిరిసిల్ల రహదారిలో రోడ్డు ప్రమాదం.. ముగ్గురికి తీవ్ర గాయాలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

వేములవాడ--సిరిసిల్ల రహదారిలోని రగుడు ఎల్లమ్మ ఆలయ మలుపు వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కనున్న బండరాళ్లను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ప్రయాణిస్తున్న ముగ్గురు యువకులకు తీవ్ర గాయాలు అయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండగా, మరొకరి కాలు విరిగినట్లు తెలిసింది. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారు సిరిసిల్ల మరియు బద్దెనపల్లి ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తించారు. ఈ ప్రమాదానికి సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు ఘటనపై దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం.



# అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు..

**ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ:**

రాష్ట్రంలో గూడు లేని ప్రతి పేదవాడికి సొంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యంమని,అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందించి తీరుతాం అని రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ పట్టణంలోని 10, 16వ వార్డులతో పాటు, రూరల్ మండలం పోచెట్టిపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమాలకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కొత్త ఇళ్లలోకి ప్రవేశిస్తున్న లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందజేసి, మిఠాయిలు తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. పేదల సంక్షేమం విషయంలో ప్రభుత్వం మాట తప్పదని, మడమ తిప్పదని పేర్కొన్నారు. నిరాశ్రయులకు ఆత్మగౌరవంతో కూడిన జీవనాన్ని అందించాలనే ఉద్దేశంతోనే ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నామని అన్నారు. దశలవారీగా అర్హులైన ప్రతి కుటుంబానికి ఆర్థిక సాయం అందించి, వారు సొంత గూడు నిర్మించుకునేలా ప్రభుత్వం అండగా ఉంటుందని అన్నారు . లబ్ధిదారులు తమ సొంత ఇళ్లలో సంతోషంగా ఉండటం చూడటమే తమకు అసలైన తృప్తి అని అన్నారు.



# సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్ ఆధ్వర్యంలో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..

**జెండా ఆవిష్కరణ**

**బలగం టీవీ, సిరిసిల్ల:**

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సిరిసిల్ల పట్టణంలో వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్, 34వ వార్డ్ కౌన్సిలర్ దార్ల సందీప్ బి.వై. నగర్ పరిధిలోని 34వ వార్డ్ లో బీఆర్ఎస్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో 34వ వార్డ్ బీఆర్ఎస్ కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాణిజ్య పంటల సాగుతోనే రైతులకు సుస్థిర ఆదాయం..

- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ:**



రైతులు సంప్రదాయ సాగు పద్ధతుల నుండి బయటపడి, అధిక లాభాలనిచ్చే వాణిజ్య పంటల సాగు వైపు అడుగులు వేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన "రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు" అవగాహన కార్యక్రమానికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.

ఈ సందర్భంగా విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, రైతును రాజుగా చూడాలన్నదే తమ లక్ష్యమని అన్నారు. పంట మార్పిడి విధానంలో భాగంగా ఆయిల్ పామ్, నూనెగింజలు మరియు పప్పు ధాన్యాల సాగుపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రభుత్వం సూచించిన సన్నరకాల వరి వంగడాలను పండించడం ద్వారా రైతులు బోనస్ పొందే వెసులుబాటు ఉందని అన్నారు. వ్యవసాయ రంగంలో శాస్త్రవేత్తల సలహాలు ఎంతో కీలకమని, రైతులు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకుని నేల స్వభావాన్ని బట్టి ఎరువులు వాడాలని సూచించారు. ముఖ్యంగా యూరియా వాడకాన్ని తగ్గించి, భూసారాన్ని పెంచేలా సేంద్రియ పద్ధతులను అవలంబించాలని కోరారు. ఈ సదస్సులో శాస్త్రవేత్తలు నీటి సంరక్షణ పద్ధతులు మరియు ఆధునిక సాగు మెళకువలపై రైతులకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ వేణుగోపాల్ రెడ్డి, రైతు విజ్ఞాన కేంద్రం నోడల్ అధికారి డాక్టర్ సాయికుమార్, అసోసియేట్

# ఆలయాల అనుసంధానానికి పెద్దపీట..

- **ఆర్టీసీ కార్మికుల సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం కట్టుబడి ఉంది..**
- **ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టీవీ, వేములవాడ:**



రాజన్న క్షేత్రంతో పాటు రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాలను అనుసంధానించి, ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రపంచస్థాయికి తీసుకెళ్లడమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ క్షేత్రం నుండి భద్రాచలం వరకు నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సు సర్వీసులను వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్ లో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఇటీవల మరణించిన నర్సంపేట డిపో డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల ఆయన ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం పుణ్యక్షేత్రాలను అనుసంధానిస్తూ కొత్త బస్సు సర్వీసులను పెంచుతున్నామని అన్నారు.వేములవాడ నుంచి ఇప్పటికే శ్రీశైలానికి బస్సులు నడుస్తున్నాయని, తాజాగా భద్రాచలం సర్వీసును ప్రారంభించామని,త్వరలోనే బాసరకు కూడా కొత్త సర్వీసులు అందుబాటులోకి వస్తాయన్నారు. ప్రజలందరూ ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి సంస్థను లాభాల బాటలో నడిపించాలని పిలుపునిచ్చారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 56 రోజుల పాటు సమ్మె జరిగినప్పుడు కార్మికుల పట్ల అత్యంత కఠినంగా వ్యవహరించారని మండిపడ్డారు. నాటి ప్రభుత్వం కార్మికులను 'సెల్ఫ్ డిస్మిస్' చేస్తామని భయపెట్టిందని, ఆ ఆందోళనలో సుమారు 32 మంది కార్మికులు ప్రాణాలు కోల్పోయినా కనీసం పరామర్శించిన నాథుడే లేడని అన్నారు. కార్మికులను కేవలం ఓటు బ్యాంకుగా కాకుండా, ప్రభుత్వంలో భాగస్వాములుగా చూడాలన్నదే తమ ఉద్దేశమని పేర్కొన్నారు.నేడు కార్మికుల సమస్యలను కేవలం మూడు రోజుల్లోనే పరిష్కరించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకుందని అన్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని మంత్రుల బృందం సుమారు 14 గంటల పాటు సుదీర్ఘంగా చర్చలు జరిపి, కార్మికులకు భరోసా కల్పించిందని అన్నారు. శంకర్ గౌడ్ వంటి కార్మికుల త్యాగాలు వృథా

# స్వయం ఉపాధి పొందుతూ.. ఆర్థికంగా ఎదగాలి..

- **జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **ఆరుగురు మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో అందజేసిన కుట్టు మిషన్లను మహిళలు సద్వినియోగం చేసుకొని.. ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు. చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో తంగళ్ళపల్లి మండలం బద్దెనపల్లి టెక్స్టైల్ పార్కులో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మహిళలకు కుట్టు శిక్షణ కొనసాగుతుండగా, జిల్లా కలెక్టర్ అప్పుడు పరిశీలించారు. కుట్టు శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడారు. ఎక్కడి నుంచి వచ్చారు? ఎన్ని రోజులుగా శిక్షణ పొందుతున్నారు? శిక్షణలో ఏ ఏ మెలుకువలు అందిస్తున్నారు అనే అంశాలపై ఆరా తీశారు. వారిలో నిరుపేదలకు కుట్టు మిషన్లు ఇస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధికార యంత్రాంగం ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన రామిడి లక్ష్మి, బత్తిని అశ్విని, పోతూరి లావణ్య, దొరగళ్ల ప్రేమలత, పోతూరి నిర్మల, మంద సుమలతకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సోమవారం కుట్టు మిషన్లను జిల్లా కలెక్టర్ అందజేశారు.

అనంతరం కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ... కుట్టు మిషన్లను మహిళలు సద్వినియోగం చేసుకొని స్వయం ఉపాధి పొందాలని సూచించారు. ఇటీవల చేనేత జౌళి శాఖ ఆధ్వర్యంలో అందించిన శిక్షణలో మెలకువలు వినియోగిస్తూ.. యూనిఫాంలు, ఇతర డ్రెస్సులు, ఆధునిక డిజైన్లతో డ్రెస్సులు కుట్టాలని పేర్కొన్నారు. ఆర్థికంగా రాణించి మిగతా వారికి ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో చేనేత జౌళి శాఖ ఏడీ సంతోష్, మెప్మా ఏవో మీర్జా ఫసహత్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..


**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా భారత రాష్ట్ర సమితి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. సిరిసిల్ల పట్టణంలోని బీఆర్ఎస్ భవన్ లో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య పార్టీ జెండాను ఆవిష్కరించినారు.

ఈ సందర్భంగా ఆగయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆవిర్భవించిన పార్టీ నేడు అభివృద్ధిలో అగ్రగామిగా నిలిచిందని, పార్టీ శ్రేణులు నిరంతరం ప్రజల్లో ఉంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళా చక్రపాణి పాల్గొన్నారు. సిరిసిల్ల పట్టణంలోని ఎనిమిదో వార్డ్ పెద్దూర్ల పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సందర్భంగా బీ ఆర్ ఎస్ నాయకులు జెండా ఆవిష్కరించారు. ఇక్కడ వార్డ్ కౌన్సిలర్ లింగంపల్లి భాగ్యలక్ష్మి సత్యనారాయణ, వార్డు అధ్యక్షులు మే డుదుల దేవయ్య ,సీనియర్ నాయకులు ఎర్రవెల్లి వెంకటరమణారావు, మాజీ సింగిల్ విండో చైర్మన్ జి ల కిషన్ యాదవ్, మాజీ సర్పంచ్ ఆది పిల్లి దేవ గౌడ్ మాజీ ఉపసర్పంచ్ ఆది ఆది పిల్లి నారాయణ పాల్గొన్నారు.సిరిసిల్ల పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద భారత రాష్ట్ర సమితి పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ జెండను సిరిసిల్ల శాఖ అధ్యక్షులు జిందం చక్రపాణి జెండాను ఎగరవేసి మిఠాయిలు పంపిణీ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని బి వై నగర్ లో సిరిసిల్ల పట్టణ మున్సిపల్ వైస్ చైర్మన్ దార్ల సందీప్ బిఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరించారు.

ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఎడ్ల సందీప్ ఆధ్వర్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం జరిపారు.. ఈ సందర్భంగా జెండాను సందీప్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కృష్ణ హరి, సర్పంచ్ ఎలగందుల నరసింహులు, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ బంధారపు బాల్ రెడ్డి, సీనియర్ నాయకులు మీసం రాజం, మండల మహిళా అధ్యక్షురాలు అఫ్సర్ ఉన్నిసా అజ్జు, బాధ రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం పదిర లో బిఆర్ఎస్ జెండా ను మాజీ జెడ్పిటిసి చీటీ లక్ష్మణరావు ఎగురవేశారు.. సిరిసిల్ల పట్టణంలోని 3వ వార్డులో గౌరవ మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి ఆధ్వర్యంలో ఆవిర్భావ దినోత్సవం ను ఘనంగా నిర్వహించారు. గంభీరావుపేట మండల కేంద్రంలో బీ ఆర్ ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్ స్వామి గౌడ్ బి ఆర్ ఎస్ జెండాను ఆవిష్కరించారు.



# బాధితుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

**జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.**


**గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 36 ఫిర్యాదులు స్వీకరణ..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం రోజున నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 36 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. తద్వారా ఫిర్యాదుదారునికి పోలీస్ శాఖపై భరోసా, నమ్మకం కలుగుతుందన్నారు. గ్రీవెన్స్ డే లో వచ్చిన ఫిర్యాదులు ఆన్ లైన్ లో పొందుపరుస్తూ ఏ మేరకు పరిష్కారం అయ్యాయో ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ ప్రజలకు మరింత సమర్ధవంతంగా సేవలందించడం జరుగుతుందని అన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధి కారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

# రాజన్న ఆలయ అభివృద్ధికి రూ.10 లక్షల విరాళం..

**బలగం టీవీ, వేములవాడ:**



రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధి మరియు విస్తరణ కార్యక్రమాల కోసం భక్తులు విరాళాలు అందజేస్తున్నారు.

ఈ క్రమంలో హైదరాబాద్‌లోని సోమాజిగూడకు చెందిన భక్తులు నీలగిరి శంకర్రావు, ప్రసూన దంపతులు ఆలయ అభివృద్ధి కోసం రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. ఈ విరాళాన్ని వారు దేవస్థానం కార్యనిర్వాహణ అధికారికి సమర్పించారు. దేవస్థానం అధికారులు దాతలకు కృతజ్ఞతలు తెలియజేసి, స్వామివారి ఆశీర్వాదాలు అందజేశారు.




# స్పెషల్ డ్రైవ్..

**బలగం టీవీ, బోయినిపల్లి:.**

జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే ఆదేశాల మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం వెంకట్రావుపల్లి మరియు బోయినిపల్లి గ్రామాలలో ఆదివారం రోజున స్పెషల్ డ్రైవ్ నిర్వహించి, 15 మంది డ్రంక్ అండ్ డ్రైవ్ చేసిన వారిని పట్టుకుని వారి మీద కేసు నమోదు చేశామని బోయినిపల్లి ఎస్సై ఎన్.రమాకాంత్ తెలిపారు.

# పిల్లలు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలి..




- కలెక్టర్ గరిమ అగ్రవాల్
- మండేపల్లిలో 'బాలల భద్రత -- డ్రగ్స్ రహిత తెలంగాణ' వారోత్సవాలు..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

పిల్లలు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ అన్నారు . రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక' 99 కార్యాచరణలో భాగంగా తంగళ్లపల్లి మండలం మండేపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో 'బాలల భద్రత.. డ్రగ్స్ రహిత తెలంగాణ' వారోత్సవాలను సోమవారం నిర్వహించారు. మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖతో పాటు పోలీస్, వైద్య ఆరోగ్య, విద్యా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వాలీబాల్ కిట్లు, ఆట పరికరాలను పంపిణీ చేశారు. అనంతరం బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శన అందరినీ ఆలోచింపజేసింది.

ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. గ్రామాల్లోని మూడు నుండి ఆరేళ్ల లోపు పిల్లలందరూ తప్పనిసరిగా అంగన్వాడీ కేంద్రాల్లో నమోదు కావాలని, ప్రభుత్వం అందించే పాలు, కోడిగుడ్లు, బాలామృతం వంటి పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంగన్వాడీ కేంద్రాలకు ఆక్వాగార్డ్ నీటి శుద్ధి యంత్రాలు, ఆట పరికరాలు పంపిణీ చేశామని, ప్రతి నెలా పిల్లల ఎత్తు, బరువును కొలిచి, ఎదుగుదల లోపం ఉన్న వారికి ఆర్.బి.ఎస్.కే వాహనాల ద్వారా ప్రత్యేక వైద్యం అందిస్తామని అన్నారు. పిల్లలను దత్తత తీసుకోవాలనుకునే వారు ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లా సంక్షేమ అధికారిని సంప్రదించాలని సూచించారు.

యువత, విద్యార్థులు డ్రగ్స్ వంటి వ్యసనాలకు దూరంగా ఉంటేనే అనుకున్న లక్ష్యాలను సులభంగా చేరుకుంటారని, మాదకద్రవ్యాలకు బానిసలైతే శారీరక, మానసిక, ఆర్థిక నష్టాలు తప్పవని అన్నారు. విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని, సెలవుల్లో ఇంట్లో తల్లిదండ్రులకు సహాయం చేస్తూ పనులను గమనించాలని సూచించారు. తమ రక్షణ కోసం ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలని, వాహనదారులు హెల్మెట్ పెట్టుకునేలా కుటుంబ సభ్యులు ప్రోత్సహించాలని కోరారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్చి 6న ప్రారంభించిన ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా జూన్ 12 వరకు జిల్లావ్యాప్తంగా పది శాఖల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని అన్నారు. గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల్లో పారిశుధ్య పనులు, విద్యార్థులకు ప్రత్యేక వైద్య పరీక్షలు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆపదలో ఉన్న మహిళలు షి టీమ్ నంబర్ 87126 56425, చైల్డ్ హెల్ప్ లైన్ 1098, టెలీ మానస్ 14416 నంబర్లను సంప్రదించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ నాగేంద్రాచారి, జిల్లా సంక్షేమ శాఖ అధికారి లక్ష్మీరాజం,జిల్లా వైద్యాధికారి రజిత, తహసిల్దార్ విజయ్ ప్రకాశ్ రావు, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ, సర్పంచ్ సాగర్, సీడీపీఓ ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.



## వీర బ్రహ్మేంద్ర స్వామి వారి సేవలో రాష్ట్ర ప్రభుత్వ విప్

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

కొనరావుపేట మండలం మర్తన్నపేట గ్రామంలో నిర్వహించిన శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కళ్యాణ మహోత్సవం భక్తి శ్రద్ధలతో వైభవంగా జరిగింది. ఈ మహోత్సవంలో రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ పరిసరాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో పాల్గొని భక్తులతో కలిసి ఆధ్యాత్మిక వాతావరణాన్ని ఆస్వాదించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్థులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



## జనగామ కలెక్టర్ తీరుపై ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డికి ఫిర్యాదు

- సిపిఎం జనగామ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి

**బలగం టీవీ, జనగామ**

జనగామ పట్టణానికి 21వ వార్డులో ఇందిరమ్మ ఇల్లు ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన భువనగిరి పార్లమెంటు సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డిని జనగామ బస్టాండ్ చౌరస్తాలో మూడవ వార్డు కౌన్సిలర్ బూడిద జ్యోతి తో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది.

ఈ సందర్భంగా భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి దృష్టికి జనగామ జిల్లా కలెక్టర్ గా ఇటీవల కొత్తగా వచ్చిన సందీప్ కుమార్ ఝా జిల్లా ప్రజల పట్ల వ్యవహరిస్తున్న తీరు వల్ల ప్రజలు తీవ్రమైన అసౌకర్యానికి గురవుతున్నారని కలెక్టర్ ఆఫీసుకు వెళ్లాలంటే రాష్ట్ర రాజభవన్ కు పోయినంత తనిఖీలు జరుగుతున్నాయని భారీకేడ్లు వేసి కలెక్టర్ ఆఫీసు గేట్లు మూసివేసి సెక్యూరిటీ పోలీసు సిబ్బందితో ప్రజలను రాజకీయ పార్టీల నాయకులను ప్రజాసంఘాల కార్యకర్తలను తనిఖీలు నిర్వహించి వాహనాలు బయటపెట్టించి నిర్బంధ పద్ధతులు ప్రయోగిస్తున్నారని జనగామ కలెక్టర్ కార్యాలయం విసునూరు దొర గడి తలపించే విధంగా ఉందని వివరించారు. మైనింగ్ నిబంధనల పేరుతో చిన్న చిన్న ట్రాక్టర్ యజమానులను జెసిపిల యజమానులపై అపరాధ రుసుముల పేరు మీద లక్షలాది రూపాయలు జరిమానులు విధించి యజమానులను బంబే లెత్తిస్తున్నారు. అలాగే ఇసుక మట్టి కావాలంటే ఇల్లు కట్టుకునేవారు గానీ ఇండ్ల అవసరాల కోసం కానీ లభించడం లేదని కలెక్టర్ నిబంధన వల్ల జిల్లా వ్యాప్తంగా వందలాది మంది భవన నిర్మాణ కార్మికులు కూలీ పని చేసుకునేవారు పనులు కోల్పోతున్నారు. వాహనాల యజమానులు వాటి యొక్క రుణం కిస్తీలు కట్టలేని పరిస్థితి జిల్లాలో ఏర్పడిందన్నారు.జనగామ వ్యవసాయ మార్కెట్లో నెల రోజులుగా రైతుల ధాన్యాన్ని ఐకెపి కొనుగోలు చేయటం లేదని రైతులు కలెక్టర్ దృష్టికి తీసుకుపోయినప్పటికిని పట్టించుకోవటం లేదని దిక్కుతో తోసని స్థితిలో ఉన్న రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి వ్యవసాయ మార్కెట్లో కొనుగోలు అమ్మకాలు జరిగే విధంగా చూడాలని కోరారు.కలెక్టర్ ఆఫీస్ పక్కన ఉన్న వనిత టీ స్టాల్ విజయ మిల్క్ డైరీ లను తొలగించుతుంటే ఆవిషయం తమ దృష్టికి తీసుకువస్తే తమరు వాటిని కొనసాగించండి అక్కడే అని లేక ఇచ్చినప్పటికిని కనీసం దాన్ని పట్టించుకున్న పాపాన పోలేదని మరి దుర్మార్గంగా వాటిని రాత్రికి రాత్రి తొలగించి ఎక్కడ వేశారో ఇప్పటివరకు బాధితులకు తెలియజేయలేదని తెలిపారు.

అంతేకాకుండా కలెక్టర్ ఆఫీసులో వివిధ డిపార్ట్మెంట్ల అధికారులు జిల్లా స్థాయి వారు కలెక్టర్ పద్ధతి వల్ల అవమానాలకు గురవుతున్నారని చెప్పుకోలేక చెప్పుకుంటే ఏమవుతుందో అన్న భయంతో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నారన్నారు. రాష్ట్రమంతటా ప్రజాపాలన పేరుతో ఉత్సాహంగా పరిపాలన కొనసాగుతా ఉంటే జనగామ జిల్లాలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా రూల్ వల్ల ప్రభుత్వానికి ప్రజాపాలనకు వ్యతిరేకంగా జిల్లాలో పరిపాలన కలెక్టర్ చేస్తున్నాడు దీనివల్ల ప్రభుత్వానికి తీవ్రమైన బదనం ఏర్పడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ తో సమీక్ష సమావేశం ఉంది. తగు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# జన గణన స్వీయ గణన ప్రక్రియను విజయవంతం చేయాలి..

- డిజిటల్ జన గణనలో భాగస్వాములు కావాలి
- వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు
- ఇంటి నుండే మీ జనాభా వివరాల నమోదు
- వేములవాడలో స్వీయ గణన అవగాహన కార్యక్రమం




**బలగం టీవీ, వేములవాడ:**

జన గణన 2027లో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వీయ గణన ప్రక్రియను పట్టణ ప్రజలందరూ వినియోగించుకుని విజయవంతం చేయాలని వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు పిలుపునిచ్చారు. ఆదివారం వేములవాడ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో జన గణన ప్రక్రియపై ప్రభుత్వ ఉపాధ్యాయులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జరుగుతున్న మొదటి జన గణన ఇది అని, తొలిసారిగా డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్న ఈ ప్రక్రియలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఏప్రిల్ 26 నుండి మే 10వ తేదీ వరకు ప్రజలు తమంతట తామే ఆన్లైన్ ద్వారా వివరాలు నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. https://se.census.gov.in వెబ్సైట్ ద్వారా కేవలం 5 నిమిషాల్లో స్వీయ గణన పూర్తి చేయవచ్చని, ఈ వెబ్సైట్ పూర్తి సురక్షితమైనదని ఆయన స్పష్టం చేశారు. ప్రజలు ఇచ్చే సమాచారం గోప్యంగా ఉంటుందని, దీనివల్ల ప్రభుత్వ పథకాలకు ఎలాంటి ఇబ్బంది కలగదని వెల్లడించారు.

ఆన్లైన్లో నమోదు చేసుకున్న తర్వాత వచ్చే 11 అంకెల రాజు క్ష్మీణని భద్రపరుచుకోవాలని, మే 11 తర్వాత ఇంటికి వచ్చే ఎన్యూమరేటర్లకు దీనిని చూపించి ధృవీకరించుకోవాలని సూచించారు. జన గణన విధుల్లో పాల్గొనే ఉపాధ్యాయులు, ఎన్యూమరేటర్లు ప్రజలకు అవగాహన కల్పించి, సర్వేలో అడిగే 34 ప్రశ్నలకు సరైన సమాచారం సేకరించాలని కోరారు. వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ ఉద్యోగులు తమ మొబైల్ ఫోన్ల ద్వారా స్వీయ గణన చేసుకోవాలని, ఇంటింటికి వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించి సమయాన్ని ఆదా చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరాల శేఖర్, మున్సిపల్ కమిషనర్ సంపత్ కుమార్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, ఉపాధ్యాయులు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నేత్ర దాత చేపూరి రాజమ్మ సంస్మరణ సభ..




- నేత్ర, అవయవ, దేహ దానం మానవ జన్మకు మహా పుణ్య కార్యం..

**బలగం టీవీ, బోయినిపల్లి:**

రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం తడగొండ నివాసి చేపూరి రాజమ్మ అనారోగ్యంతో 15-4-2026న మరణించగా,సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్రదానం చేసారు. నేత్ర దాత చేపూరి రాజమ్మ సంస్మరణ సభను ఆదివారం రోజున వారి స్వగ్రామం తడగొండలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ ప్రధాన కార్యదర్శి చౌడవరపు లింగమూర్తి నిర్వహించి, రాజమ్మకు ఘనంగా నివాళులు అర్పించి, వచ్చిన బంధు మిత్రులకు, గ్రామస్థులకు నేత్ర, అవయవ, దేహ దానాలపై అవగాహనా కల్పిస్తూ, కోట్ల రూపాయలు పెట్టిన దొరకని మానవ సంజీవినులైన నేత్ర అవయవలు, మనం మరణించినాకె దానం చేయడం ద్వారా మనం జీవించినట్లేనని, ఇది పుణ్య కార్యమని ప్రతి ఒక్కరు అవగాహనా పొందిచేయాలి అని తెలిపారు.

ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన కుటుంబ సభ్యులకు పాల్గొని అభినందనలు తెల్పిన ప్రజా ప్రతినిధులుచేపూరి మహిపాల్, సింగరేణి విశ్రాంత జనరల్ మేనేజర్ రాములు ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించిన కుమారుడు కోడలు చేపూరి దేవేందర్ లక్ష్మి ప్రసన్న, రవీందర్ అరుణ, కూతురు అల్లుడు శోభ ఆనంద్ రెడ్డి మరియు మనుమలు మనుమరా0డ్లకు సదాశయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షులు శ్రవణ్ కుమార్,కార్యదర్శి డాక్టర్ భీష్మాచారి,ప్రచార కార్యదర్శి వాసు,గౌరవ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి ముఖ్య సలహాదారులు రమేష్, ప్రతినిధులు బర్ల రవీందర్,యం.కనకయ్య,యం. సత్యం,కయ్యం మల్లయ్య,బిరుదు రాజన్న,మాజీ సర్పంచ్ చిందం రమేష్,చేపూరి మహిపాల్ అభినందనలు ధన్యవాదాలు తెలిపారు.




## వేములవాడ భీమేశ్వర స్వామి ఆలయంలో ప్రముఖుల ప్రత్యేక పూజలు

- భక్తిశ్రద్ధలతో దర్శనం

**బలగం టీవీ, వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి వారి సన్నిధిలో ప్రముఖులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులు స్వామివారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో సేవలు సమర్పించారు.

ఈ సందర్భంగా ప్రసిద్ధ ప్రవచనకర్త బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమెరికాలోని న్యూ జెర్సీలో శివ విష్ణు ఆలయం నిర్మాణంలో సేవలందించిన రఘు శర్మ సంస్కృత సోదరుడు కూడా ఆలయానికి విచ్చేసి స్వామివారి ఆశీస్సులు పొందారు. ప్రధానమంత్రి సలహాదారులుగా ఉన్న ఆదిత్య దీక్షిత్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని స్వామివారిని భక్తిపూర్వకంగా దర్శించుకున్నారు. పూజల అనంతరం స్వామివారి మండపంలో ఆలయ అర్చకులు, వేద పండితులు వారికి వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం స్వామివారి శేష వస్త్రం, లడ్డూ ప్రసాదాన్ని అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమం సందర్భంగా ఆలయంలో భక్తుల రద్దీ కనిపించింది. భక్తులు శాంతియుతంగా దర్శనాలు చేసుకుని స్వామివారి కృపను పొందారు. ఆలయ వాతావరణం భక్తిరసంతో నిండిపోయి ఆధ్యాత్మికంగా మారింది.

# ఎల్లారెడ్డిపేటలో ఘనంగా బీఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు..

- పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని బీఆర్ఎస్ ఎల్లారెడ్డిపేట పట్టణ అధ్యక్షుడు ఎడ్ల సందీప్ ఆధ్వర్యంలో నిర్వహించగా, ఆయన పార్టీ జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా వేడుకలను జరుపుకున్నారు. మండల అధ్యక్షుడు కృష్ణ హరి, సర్పంచ్ ఎలగందుల నరసింహులు, రెడ్డి సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ బంధారపు బాల్ రెడ్డి, సీనియర్ నాయకుడు మీసం రాజం, మండల మహిళా అధ్యక్షురాలు అప్సర్ ఉన్నిసా అజ్జు, నాయకుడు బాధ రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## గురుకుల కళాశాలలో మరో విద్యార్థి ఆత్మహత్య




**బలగం టీవీ, మహబూబాబాద్:**


గురుకుల విద్యాసంస్థల్లో విద్యార్థుల భద్రతపై మళ్లీ ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం నాంచారి మడూరు గ్రామ శివారులో ఉన్న మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల కళాశాలలో రచర్ల కార్తీక్ (19) అనే విద్యార్థి ఉరివేసుకుని మృతిచెందిన ఘటన కలకలం రేపుతోంది.

మృతుడు భూపాలపల్లి జిల్లా గోరికొత్తపల్లి గ్రామానికి చెందినవాడిగా గుర్తించారు. ఈ ఘటనతో గురుకులాల్లో విద్యా ర్థుల పరిస్థితులపై మరోసారి ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రెండున్నర సంవత్సరాల కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో ఇప్పటివరకు 132 మంది గురుకుల విద్యార్థులు మృత్యువాత పడ్డారని సమాచారం.

కార్తీక్ చిన్నప్పటి నుంచే హాస్టళ్లలో చదువుకున్నాడని, అతను ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని మృతుడి తల్లి ఆవేదన వ్యక్తం చేసింది. తన కుమారుడి మరణంపై అనుమానాలు ఉన్నాయని పేర్కొంది. ఇదే సమయంలో, హాస్టల్లో సీసీటీవీ కెమెరాలు పనిచేయడం లేదని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. తాము ఘటనాస్థలానికి చేరుకునేలోపే మృతదేహాన్ని పోస్ట్మార్టం కోసం తరలించారని, ఆత్మహత్యగా ఎలా నిర్ధారించారని ప్రశ్నిస్తున్నారు. ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి నిజానిజాలు బయటపెట్టాలని కుటుంబ సభ్యులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం..

**ఎస్ఈ వేణుమాధవ్**



**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

రైతులకు నాణ్యమైన మరియు అంతరాయం లేని విద్యుత్ సరఫరాను అందించడమే ప్రధాన లక్ష్యంగా ఎన్పీడీసీఎల్ పని చేస్తోందని రాజన్న సిరిసిల్ల సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్ఈ) టి. వేణుమాధవ్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఈ వేణుమాధవ్ మాట్లాడుతూ.. వ్యవసాయ రంగానికి ప్రాధాన్యతనిస్తూ రైతులకు మెరుగైన సేవలందించేందుకు ప్రత్యేకంగా డిపార్ట్మెంట్ ట్రాన్స్ఫార్మర్ వాహనాలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు పేర్కొన్నారు. సర్కిల్ పరిధిలోని ప్రతి డివిజన్, సబ్ డివిజన్లలో కలిపి మొత్తం 7 ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేశామని, వీటి ద్వారా కాలిపోయిన లేదా పాడైన ట్రాన్స్ఫార్మర్లను వెంటనే తరలించి, నూతన ట్రాన్స్ఫార్మర్లను అమర్చడం సులభతరమవుతుందని అన్నారు. ఈ వాహనాలన్నింటికీ జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థను అనుసంధానించామని, తద్వారా వాటి కదలికలను నిరంతరం పర్యవేక్షిస్తూ రైతులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా వేగంగా స్పందిస్తున్నామని అన్నారు. ట్రాన్స్ఫార్మర్ సమస్య తలెత్తిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందిస్తే, 100 శాతం శాఖా పరమైన వాహనాల ద్వారానే రవాణా ప్రక్రియను పూర్తి చేస్తున్నట్లు తెలిపారు.

ముఖ్యంగా వ్యవసాయ సీజన్లో విద్యుత్ అంతరాయం కలగకుండా ఉండటానికి ఈ వాహనాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. రైతులు విద్యుత్ సమస్యలు తలెత్తినప్పుడు స్వయంగా విద్యుత్ పరికరాలను తాకరాదని, ఏదైనా ఇబ్బంది ఉంటే వెంటనే '1912' టోల్ ఫ్రీ నంబర్కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఫిర్యాదు అందిన వెంటనే స్పందించి సమస్యను పరిష్కరిస్తామని అన్నారు. రైతులకు మెరుగైన సేవలు అందిస్తూ వారి ఆదరణ పొందేలా విద్యుత్ శాఖ ఉద్యోగులందరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని పిలుపునిచ్చారు




## ఎనిమిదో వార్డ్లో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం

**బలగం టీవీ, సిరిసిల్ల:**

సోమవారం రోజున ఎనిమిదో వార్డ్ పెద్దూర్లలో బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి వార్డ్ కౌన్సిలర్ లింగంపల్లి భాగ్యలక్ష్మి సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వార్డు అధ్యక్షులు మే డుదుల దేవయ్య, సీనియర్ నాయకులు ఎర్రవెల్లి వెంకటరమణారావు, మాజీ సింగిల్ విండో చైర్మన్ కిషన్ యాదవ్, మాజీ సర్పంచ్ ఆదిపిల్లి దేవ గౌడ్, మాజీ ఉపసర్పంచ్ ఆదిపిల్లి నారాయణ, గుగ్గిల రాజు, జెట్టి రాజు, ముస్కుమ్ లీల, సత్తయ్య, లడ్డు దేవన్న, తమ్ముటి జీవన్, సలంద్రి రాజు, రవి మరియు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కార్తీతో బోయపాటి మూవీ

### చిత్రపరిశ్రమలో పుకార్ల షికారు





టాలీవుడ్‌లో 'మాస్ సినిమాల చిరునామా'గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న బోయపాటి శ్రీను, స్క్రీన్ మీద హీరోని ఎంత పవర్‌ఫుల్‌గా చూపించవచ్చో, విలన్‌ను ఎంత భయంకరంగా సృష్టించవచ్చో.. బోయపాటి సినిమాలను చూస్తే అర్థమవుతుంది. కేవలం ఫైట్లు, రక్తం మాత్రమే కాకుండా, ప్రేక్షకుడి నరాల్లో రక్తం ఉడికేలా చేసే హై-వోల్టేజ్ ఎలివేషన్లు ఆయన సొంతం. ఒక సాధారణ కథను కూడా తనదైన మేకింగ్ స్టైల్‌తో వెండితెరపై ఒక విజువల్ వండర్‌గా మార్చడంలో ఆయన దిట్ట. మొదటి సినిమా నుండి మొన్నటి 'అఖండ-2' వరకు ఆయన ఎంచుకునే యాక్షన్ సీక్వెన్స్, డైలాగ్ డెలివరీలో ఒక ప్రత్యేకమైన 'బోయపాటి మార్క్' స్పష్టంగా కనిపిస్తుంది. అయితే, అఖండ-2 తర్వాత ఆయన ఎవరితో జతకట్టబోతున్నారనే విషయంపై గత కొద్ది రోజులుగా ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. మొదట ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో సరైనోడు-2 సినిమా ఉంటుందని ప్రచారం జరిగినప్పటికీ, వివిధ కారణాల వల్ల అది పట్టాలెక్క లేదు. ఆ తర్వాత బాలీవుడ్ హీరోలతో సినిమా ఉంటుందని వార్తలు వచ్చినా, అవి కేవలం పుకార్లుగానే మిగిలిపోయాయి. తాజాగా, కోలీవుడ్ స్టార్ హీరో కార్తీ పేరు తెరపైకి రావడంతో సినీ ప్రియుల్లో కొత్త ఉత్సాహం నెలకొంది. తెలుగు, తమిళ భాషల్లో మంచి ఫ్యాన్ బేస్ ఉన్న హీరో కార్తీకి మాస్ యాక్షన్ సినిమాలంటే మక్కువ ఎక్కువే. మరో వైపు బోయపాటి శ్రీను తనదైన శైలిలో హై-వోల్టే జ్ యాక్షన్ డ్రామాలను వెండితెరపై ఆవిష్కరించడంలో దిట్ట. వీరిద్దరి కలయికలో సినిమా వస్తుందనే వార్త ఇప్పుడు సోషల్ మీడియాలో 'టాక్ ఆఫ్ ది టౌన్'గా మారింది. కార్తీ ఇమేజ్‌కు సరిపడే పక్కా మాస్ కథను బోయపాటి ఇప్పటికే సిద్ధం చేశారని, ఈ ప్రాజెక్ట్ గనుక ఓకే అయితే సౌత్ ఇండియాలో ఇదొక భారీ క్రేజీ కాంబినేషన్ అవుతుందని ఇన్‌సైడ్ టాక్ వినిపిస్తోంది. సాధారణంగా బోయపాటి సినిమాల్లో హీరోల ఎలివేషన్స్, యాక్షన్ సీక్వెన్స్ పీక్స్‌లో ఉంటాయి. కార్తీ కూడా ప్రయోగాత్మక సినిమాలతో పాటు కమర్షియల్ ఎంటర్‌టైనర్లలో తనదైన ముద్ర వేశారు. తెలుగు మార్కెట్‌పై పట్టు పెంచుకుంటున్న కార్తీకి, బోయపాటి మాస్ ఇమేజ్ తోడైతే బాక్సాఫీస్ వద్ద రికార్డులు తిరగరాయడం ఖాయం అని అంటున్నారు.

# జూన్ 25న పెద్ది విడుదల ఖాయం

### దర్శకుడు సానా బుచ్చిబాబు వెల్లడి





రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న 'పెద్ది' చిత్రం విడుదలపై క్లారిటీ వచ్చింది. ఇప్పటికే రెండు సార్లు వాయిదా పడిన ఈ చిత్రం ఫైనల్‌గా జూన్ 25న విడుదల కానుందని రెండ్రోజులుగా వార్తలు హల్‌చల్ చేస్తున్న సంగతి తెలిసిందే! అయితే దీనిపై దర్శకుడు సాన బుచ్చిబాబు క్లారిటీ ఇచ్చారు. ధనుష్ హీరోగా నటించిన 'కర' చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ఆయన అతిథిగా హాజరయ్యారు. అక్కడ 'పెద్ది రిలీజ్ ఎప్పుడు అని అభిమానులు గోల చేయగా బుచ్చి విడుదల తేదిని ప్రకటించారు. ఎట్టి పరిస్థితుల్లో జూన్ 25 సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుందని తెలిపారు. దీంతో అభిమానులు కాస్త ఊరట చెందారు. ఉత్తరాంధ్ర ప్రాంతంలో క్రీడా నేపథ్యంలో సాగే చిత్రమిది. ఇందులో చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. ఏఆర్ రెహమాన్ సంగీతం అందిస్తున్నారు. ఇప్పటికే ఈ చిత్రం నుంచి విడుదలైన రెండు పాటలు దుమ్ము లేపేశాయి. త్వరలో ఓ డ్యూయెట్ రానుంది. ఆ తర్వాత శ్రుతీహాసన్, రామ్‌చరణ్‌పై చిత్రీకరిస్తున్న ప్రత్యేక గీతాన్ని విడుదల చేయడానికి ప్రయత్నం చేస్తున్నారు. షూటింగ్ ఆలస్య, పోస్ట్ ప్రొడక్షన్ పనులు సమయం సరిపోకపోవడం వల్ల విడుదల వాయిదా పడిన సంగతి తెలిసిందే.

# ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్




### సాయిపల్లవి కాదు కాదు...రుక్మిణీ వసంత్

జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి రూపొందించబోతున్న సంగీత సామ్రాజ్ఞి ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో సాయిపల్లవి నటించబోతోందనే వార్త కొంతకాలంగా మీడియాలో చక్కర్లు కొడుతోంది. అలానే ఆమె పేరుతో పాటు నయనతార పేరు కూడా ఆ మధ్య వినిపించింది. అలా మరో ఇద్దరు ముగ్గురి పేర్లనూ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రతో ముడి పెట్టి కొందరు ప్రచారం చేశారు. అయితే ఫైనల్‌గా సాయిపల్లవి దగ్గరే అది ఆగింది. కానీ ఇప్పుడు ఆ పాత్ర సాయి పల్లవి చేజారి... రుక్మిణీ వసంత్ ను చేరిందని వార్తలు వస్తున్నాయి. సాయిపల్లవికి ఈ పాత్ర చేయాలనే కోరిక బలంగా ఉన్నా... ఇప్పటికే ఆమె కమిట్ ... ఈ పాత్రను వదిలేసుకుందని అంటున్నారు. ఇదిలా ఉంటే... పలు కన్నడ, తెలుగు సినిమాలతో ఇప్పటికే దక్షిణాది సినీ అభిమానుల గుండెల్లో చోటు దక్కించుకున్న రుక్మిణి వసంత్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మి బయోపిక్‌లో నటిస్తున్నట్టు వార్తలు వస్తున్నాయి. 'కాంతార: చాప్టర్ 1'తో రుక్మిణీ వసంత్ సైతం జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకుంది. ప్రస్తుతం ఆమె యశ్ మూవీ 'టాక్సిక్'లో నటిస్తోంది. అలానే ప్రభాస్ సరసన 'డ్రాగన్' చేస్తోంది. తమిళంలోనూ ధనుష్ మూవీలో రుక్మిణీ వసంత్ ఎంపికైందని వార్తలు వచ్చాయి. కెరీర్ మంచి ఊపు మీద ఉన్న ఈ సమయంలో ఆమె ఎమ్మెస్ సుబ్బులక్ష్మి పాత్రను చేస్తే ఖచ్చితంగా అది ప్రాజెక్ట్‌కు ఉపయోగపడే అంశమే! అయితే రుక్మిణీ వసంత్ ఎమ్మెస్ సుబ్బులక్ష్మిగా నటించబోతోందనే విషయాన్ని ఇంకా అధికారికంగా మేకర్స్ ప్రకటించలేదు.



# శరవేగంగా కల్కి-2 షూటింగ్




### తమిళ నటుడు శింబు కూడా చేరినట్లు ప్రచారం

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు నాగ్ అశ్విన్ తెరకెక్కించిన 'కల్కి చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని నమోదు చేసి వెయ్యి కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. పురాణాల ఆధారంగా భవిష్యత్ నేపథ్యంలో సాగిన ఈ సినిమా ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ఇప్పుడు ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'కల్కి 2'ను మరింత భారీ స్థాయిలో తీసుకురావడానికి మేకర్స్ సిద్ధమవుతున్నారు. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు వేగంగా సాగుతున్నాయి. కథను మరింత లోతుగా, భావోద్వేగపూర్వకంగా తీర్చిదిద్దేందుకు దర్శకుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు సమాచారం. మొదటి భాగంలో చూపించిన ప్రపంచాన్ని విస్తరించి, కొత్త పాత్రలు, ఆసక్తికరమైన మలుపులతో సీక్వెల్‌ను రూపొందించాలని ప్లాన్ చేస్తున్నారు. తాజాగా వినిపిస్తున్న వార్తల ప్రకారం ఈ సీక్వెల్‌లో ఒక పవర్‌ఫుల్ స్పెషల్ పాత్ర ఉండబోతుందని, అది క్లైమాక్స్‌లో కీలకంగా మారుతుందని టాక్. ఆ పాత్ర కోసం తమిళ స్టార్ హీరో శింబును సంప్రదించినట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఆయన ఈ సినిమాలో నటిస్తే తమిళ మార్కెట్‌లో సినిమాకు మరింత బలం చేకూరే అవకాశముందని అంటున్నారు. మొదటి భాగం చివర్లో ప్రభాస్ పాత్రను కర్ణుడిగా చూపిస్తూ మేకర్స్ ఇచ్చిన ట్విస్ట్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. దీంతో సీక్వెల్‌పై ఆసక్తి మరింత పెరిగింది. ఈసారి కథ ప్రధానంగా కర్ణుడి గతం, అతని గాథ, తిరిగి రావడం వంటి అంశాలపై నడుస్తుందని సమాచారం. బాలీవుడ్ లెజెండ్ అమితాబ్ బచ్చన్ ఇప్పటికే షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఆయన మళ్లీ అశ్వత్థామ పాత్రలో కనిపించనున్నారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో షూటింగ్ జరుగుతుండగా, బిజీ షెడ్యూల్ కారణంగా అభిమానులను కలవలేకపోయానని ఆయన తెలిపారు. ప్రభాస్ కూడా త్వరలో షూటింగ్‌లో చేరను న్నారని సమాచారం. ఇక మరో ముఖ్య ఆకర్షణగా కమల్ హాసన్ కూడా ఈ సీక్వెల్‌లో కనిపించనున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్ చాలా ఏళ్ల తర్వాత మళ్లీ కలిసి నటిస్తుండడం విశేషం. ఇక ఈ సినిమాలో దుల్కర్ సల్మాన్, జేడీ చక్రవర్తి కూడా కీలక పాత్రల్లో కనిపించనున్నట్లు సమాచారం. దీంతో 'కల్కి 2'కు భారీ తారాగణం సిద్ధమవుతోంది.



# చీన్ టపాక్ డుం డుం ..సినిమా టైటిల్




గవిరెడ్డి శ్రీనివాస్ హీరోగా కొత్త చిత్రం చీన్ టపాక్ డుం డుం' అనే వినూత్నమైన టైటిల్‌తో ఓ కొత్త తెలుగు సినిమా ప్రారంభమైంది. 'శుభం' సినిమా, 'కుమారి శ్రీమతి' వంటి వెబ్ సిరీస్‌ల ద్వారా గుర్తింపు తెచ్చుకున్న గవిరెడ్డి శ్రీనివాస్ ఈ చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. పూర్తి స్థాయి కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ సినిమా ప్రేక్షకులకు వినోదాన్ని పంచేలా ఉండనుందని చిత్ర బృందం చెబుతోంది. ఈ సినిమా ప్రారంభ కార్యక్రమం ఘనంగా జరిగింది. పలువురు సినీ ప్రముఖులు హాజరై యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. ముహూర్తపు షాట్‌కు నటి సమంత క్లాప్ కొట్టగా, దర్శకుడు గోపిచంద్ మలినేని తొలి షాట్‌ను డైరెక్ట్ చేశారు. మల్లిడి వశిష్ట కెమెరా ఆన్ చేయగా, నందిని రెడ్డి, బీవీఎస్ రవి, గౌతమి కలిసి స్క్రిప్ట్‌ను అందించి చిత్రాన్ని ప్రారంభించారు. ఈ చిత్రాన్ని శ్రీను నాగులపల్లి 'విలేజ్ టాకీస్' బ్యానర్‌పై నిర్మిస్తున్నారు. ఇది ఆయనకు నిర్మాతగా తొలి సినిమా కావడం విశేషం. సినిమాకు వై.ఎన్ లోహిత్ దర్శకత్వం వహిస్తున్నారు. హీరోయిన్‌గా బ్రిగిడా సాగా నటిస్తుండగా, దువ్వాడ మాధురి ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. టెక్నికల్ టీమ్ విషయానికి వస్తే, ఆర్ట్ డైరెక్టర్‌గా ఏ.ఎస్. ప్రకాష్ పనిచేస్తున్నారు. సినిమాటో గ్రఫీ బాధ్యతలను సెంథిల్ కుమార్ నిర్వహిస్తున్నారు. సంగీతాన్ని పీఆర్ మ్యూజిక్ అందిస్తుండగా, పాటలను తిరుపతి జావానా రాస్తున్నారు. కథ, స్క్రీన్‌ప్లేలను దివ్య తేజస్వి, విక్రమ్ కుమార్ కె, నాగ్ ట్రైల్‌బ్లేజర్, ఏకలవ్య కలిసి సిద్ధం చేశారు. ఇప్పటికే నర్సీపట్నం, హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ వేగంగా కొనసాగుతోంది. ఆగస్టు నెలలో సినిమాను విడుదల చేయాలని చిత్ర బృందం లక్ష్యంగా పెట్టుకుంది. వినోదభరితమైన కథ, నవ్వులు పంచే సన్నివేశాలతో 'చీన్ టపాక్ డుం డుం' ప్రేక్షకులను అలరించనుందని యూనిట్ ఆశాభావం వ్యక్తం చేస్తోంది. కాగా, దువ్వాడ మాధురి ప్రయాణం ఎప్పుడూ చర్చనీయాంశంగానే కొనసాగుతోంది. క్లాసికల్ డ్యాన్సర్‌గా, బిజినెస్ ఉమెన్‌గా గుర్తింపు పొందిన ఆమె, వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌తో ఉన్న సంబంధం కారణంగా విస్తృతంగా వార్తల్లో నిలిచారు.




# ధనుష్‌తో మరోమారు వెంకీ అట్లూరి జత



తమిళ నటుడు ధనుష్‌తో 'సార్' సినిమా తీసి విజయం అందుకున్నారు తెలుగు దర్శకుడు వెంకీ అట్లూరి. అప్పటి నుంచి వీరిద్దరి మధ్య బంధం బలపడింది. ధనుష్ నటించిన ఏ సినిమా తెలుగులో విడుదలైనా వెంకీ అట్లూరి ప్రమోషన్స్‌లో భాగమవుతున్నారు. 'సార్' కాంబినేషన్‌లో మరో సినిమా వస్తుందని చాలాకాలంగా టాక్ నడుస్తోంది. ఈ రూమర్స్ నిజమేనని స్పష్టమైంది. హైదరాబాద్‌లో జరిగిన 'కర' ప్రీరిలీజ్ ఈవెంట్‌కు వెంకీ అట్లూరి గెస్ట్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ధనుష్ వెంకీని ఉద్దేశించి మాట్లాడుతూ 'చివరి నిమిషంలో పిలిచినా వచ్చినందుకు థ్యాంక్స్. మీరు నాకు బ్రదర్‌లాంటివారు. 'సార్' లాంటి మంచి చిత్రాన్ని నాకు ఇచ్చారు. 'సార్' తర్వాత మీరో కథ నెరేట్ చేసి.. అదృశ్యమయ్యారు. ఆ కథను సంపూర్ణంగా తీసుకురండి. సినిమా చేయడానికి నేను రెడీగా ఉన్నా. మీ సక్సెస్‌కు చాలా ఆనందిస్తున్నా. మీ గత చిత్రం 'లక్కీ భాస్కర్' చాలా నచ్చింది. మీ రాబోయే సినిమా 'విశ్వనాథ్ అండ్ సన్స్' కు కూడా శుభాకాంక్షలు' అని అన్నారు. ధనుష్ నటించిన 'కర' సినిమా ఈ నెల 30న విడుదల కానుంది.

# మహిళల భద్రతకు ప్రభుత్వం పెద్దపీట

- మహిళలు, చిన్నారుల రక్షణకు ప్రాధాన్యం
- మహిళలను అన్నరంగాల్లో ఆదర్శంగా నిలిపాం
- మహిళాభివృద్ధికి తెలంగాణ బ్రాండ్ కావాలి
- గంజాయి, డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతున్నాం
- మహాలక్ష్మి పథకంతో మహిళలకు ఉచిత బస్సు
- అన్నిరంగాల్లో మహిళా రిజర్వేషన్ల కాంగ్రెస్ ఘనతే
- సిఎం రేవంత్

హైదరాబాద్,ఏప్రిల్27 : అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలు, చిన్నారులకు రక్షణ మొదటి ప్రాముఖ్యతగా ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఏ దేశంలో, నగరం లో వీరికి రక్షణ ఉంటుందో.. అక్కడ అభివృద్ధి ఎక్కువగా జరుగుతుందన్నారు. మహిళలు, చిన్నారుల భద్రత కోసం హైదరాబాద్ పోలీసులు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో స్పందన బృందాలను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించి మాట్లాడారు. తెలంగాణ ప్రభుత్వం మహిళల భద్రతకు పెద్దపీట వేసింది. గతంలో షీ టీమ్స్ ఏర్పాటు చేస్తే.. 'స్టాండ్ విత్ హర్' అని ప్రత్యేక కార్యక్రమం చేపట్టాం. ఇప్పుడు తెలంగాణ ప్రభుత్వం, హైదరాబాద్ పోలీసులు స్పందన పేరుతో మరో కార్యక్రమం . వారికి తక్షణ రక్షణ కోసం ఈ టీమ్స్ పని చేస్తాయి. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ముందుంది అని చెప్పేందుకే నేను ఈ కార్యక్రమానికి హాజరయ్యానని సీఎం అన్నారు. అమెరికా లాంటి దేశాల్లోనే మహిళలకు ఓటు హక్కు వచ్చేందుకు ఎన్నో ఏళ్లు పట్టింది. స్వాతంత్య్రం రాగానే భారత్‌లో మహిళలకు నెహ్రూ సమాన హక్కు కల్పించారు. ఇప్పుడు అన్ని రంగాల్లో మహిళలు ఉన్నత స్థాయిల్లో ఉన్నారు. కానీ ఇంకా కొన్ని చోట్ల వారిపై వివక్ష ఉంది. కానీ మనదేశంలో దేశ ప్రధాని గా, లోక్ సభ స్పీకర్ గా, రాష్ట్రాల గవర్నర్లు, న్యాయమూర్తులు గా మహిళలకు కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇచ్చింది..మహిళా విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లతో పాటు స్థానిక సంస్థల్లో కూడా మహిళలకు రిజర్వేషన్లు ఇచ్చి పరిపాలన లో కాంగ్రెస్ పార్టీ భాగస్వామ్యం చేసిందన్నారు. చట్టసభల్లో మహిళల రిజర్వేషన్ల కోసం 2013 లోనే బిల్లును కాంగ్రెస్ ఆమోదించిందని గుర్తు చేశారు. ఇప్పటికి కొన్ని విషయాల్లో మహిళలపైన వివక్ష ఉంది.రాష్ట్రం అభివృద్ధి జరగాలంటే మహిళలకు రక్షణ కల్పించాలి, పిల్లలకు భద్ర త ఇవ్వాలని మా ప్రభుత్వం భావించిందన్నారు. స్పందన ద్వారా తక్షణమే బాదిత మహిళలకు మానసిక భద్రత కల్పిస్తారు.. సమస్య వచ్చినప్పుడు నా పక్కన నిలబడుతుందన్న విశ్వాసాన్ని మా ప్రభుత్వం కల్పిస్తోంది.. తెలంగాణ రాష్ట్రంలో మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్న సందేశం ఇవ్వడం కోసం నేను ఈ కార్యక్రమంలో పాల్గొన్నాను.. సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించడం కాదు.. అసలు సమస్యనే రాకుండా చూడాల్సిన సామాజిక బాధ్యత మనపైన ఉందన్నారు. మహిళల బాధలో అండగా నిలబడి ధైర్యాన్ని ఇచ్చే సామాజిక బాధ్యత అందరిపైన ఉందని, ప్రభుత్వ ప్రతి సంక్షేమ కార్యక్రమాల్లో మహిళలకు పెద్ద పీట వేస్తున్నాం అని వివరించారు.